ఏప్రిల్ - 2016

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక


ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

**చందా వివరములు :**

సంవత్సర చందా రూ. 150/-

పోషక చందా రూ. 1000/-

జీవిత చందా రూ. 3000/-

విడి ప్రతి రూ. 15/-



**మా చిరునామా :**

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28

ఒంగోలు - 523001

ఫోన్ : 08592-231281

సెల్ : 9704255416


## లోపలి పేజీల్లో...


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| అపొస్తలుడు | కొడవటికంటి | 03 |
| లియో టాల్‌స్టాయ్ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 06 |
| క్యాసబియాంకా | మామయ్య కథలు | 09 |
| | రెవ.డా॥కె.జోసఫ్‌గారు | |
| బైబిలు చరిత్ర | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 11 |
| మధ్యకాలము | | 14 |
| | బ్రదర్ కె. సామ్రాట్‌గారు | |
| మూర్ఖులగు ఈ తరము వారికి వేరై | | 17 |
| | రెవ.డా॥కె.జోసఫ్‌గారు | |
| నన్ను రక్షించిన నా దేవుని కొరకు | | 19 |
| | సాక్ష్యము | |
| రక్షణ - శుద్ధీకరణ | | 22 |
| | రెవ.డా॥ కొడవటికంటి విక్రాంత్ | |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | | 24 |
| | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | |


India Evangelistic & Relief Fellowship

| **EVANGELISM** | **RELIEF** |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelestic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Leprosy Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International | Children Care Ministry |
| Hanna Women Ministries | |


**ప్రకటన రేట్లు**

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



ప్రియ పరిశుద్ధత పాఠకులకు ప్రభువు నామమున శుభాభివందనములు.

గత నెల మాసపత్రికను గురించి ప్రశంశిస్తూ, విమర్శిస్తూ చాలా ఉత్తరాలు వచ్చినవి. అన్నీ చాలా సంతోషం కలిగించినవి. క్విజ్ పోటీలో ప్రైజులు రాలేదని కొందరు వ్రాశారు. మీరు వెంటనే మీ అడ్రసులు మాకు మెసేజ్ చెయ్యండి. కాని చాలామంది ఆలస్యంగా పంపుతున్నారు. కాబట్టి అవి పరిశీలనలోకి రావు. పత్రిక మీకు 17 లేక 18వ తారీఖు లోపల అందుతుంది. ముందుగా వచ్చిన సమాధానాలకే ప్రైజు ఇవ్వబడుతుంది. 25లోపు పంపించాలి.

ఇకపోతే, గుడ్‌ఫ్రైడే గురించి చాలా విమర్శలు వచ్చినవి. ప్రశంశలు కూడా వచ్చినవి. ఈ మూడు రోజులు గురించి మాకు కూడా చాలా అనుమానాలు ఉండేవి, మీ వివరణతో స్పష్టమయింది, చాలా సంతోషిస్తున్నాము, మీకు వందనములు అని కొంతమంది వ్రాశారు. అయితే సత్యాన్ని గ్రహించక, ఒప్పకోలేక చాలా కఠినమైన పదాలతో అసలు మీరెవరు ఎప్పటి నుండో వస్తున్న దానిని మార్చటానికి. మీకేమి అధికారం ఉంది అని కొందరు వ్రాశారు. కాని మేము ఇచ్చిన వివరణ సరియైనది కాదు అని రుజువు చేయలేకపోయారు. ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే ఫోను ద్వారా తెలిసికొనవచ్చును. దయచేసి క్రైస్తవ సహోదరులందరికి నేను నమస్కరించి, బ్రతిమిలాడి తెలియజేస్తున్న సంగతేమంటే, మనం తప్పుగా పండుగలు చేసికొని దేవుని నామమునకు అవమానము తీసుకురాకూడదు.

ఎప్పటి నుండో జరుగుతుంది అంటే తప్ప అని తెలిసిన తరువాత కూడా ఆ విధంగా చేసి క్రైస్తవ విరోధులచేత, నాస్తికులచేత యేసునామము దూషింపబడేలా చేయవద్దు. విజ్ఞులైన మీరందరూ ఆలోచించండి. ప్రభువు సన్నిధిలో సరైన నిర్ణయం తీసుకోండి. రాకడ అతి సమీపముగా ఉంది. ఆమెన్.

-ఎడిటర్

సీరియల్

# అపొస్తలుడు

25

– కొడవటికంటి

తండ్రి అయిన అబ్రాహాము ఈ దేశానికి వచ్చేటచప్పటికి ఈ దేశం ఇంకా జనాంగములతో నింపబడి యుండలేదు. అసలు పాలస్తీనాలోకి ప్రవేశము – కర్మేలు. అందువల్ల అనాగరిక, ప్రాచీన జనాంగములు ఈ కర్మేలు గుహలలో నివసించారు. ఈ కొండ ప్రాంతపు అరణ్యములో చిరుత పులులు ఎక్కువ. మొదటసారి ఈ ప్రాంతమునకు వచ్చినప్పుడు కొండ పై భాగమును చూడలేదు. తనకు ఎవరైనా తోడు దొరికితే బాగుండును అనుకున్నాడు. కాని ఈనాడు ఈ కొండను చూస్తాను రమ్మంటి, తనను ఏదో పిచ్చివాడని అనుకుంటారు. మార్గంలో ఒకరు, ఇద్దరు ఎదురైనా తనవైపు అదోవిధంగా చూస్తూ వెళ్ళిపోయారు.

ఇప్పుడు సౌలు పూర్తిగా దక్షిణం వైపు నుండి ప్రయాణం మార్చి పడమర వైపుకు కొండమీదకు ప్రయాణం మొదలు పెట్టాడు. ఆకలి కూడా ప్రారంభమైంది. కర్మేలు పైకి వెళ్ళి భోజనం చెయ్యాలి అనుకున్నాడు. కొండ అంత నిలువుగా లేదు. చెట్లు కూడా చిక్కగా లేవు. చిన్న సెలయేరు తనకు దగ్గరలో ప్రవహిస్తోంది. ఇటువంటివి కొన్ని ఇంకొన్ని కలసి కీషోను బాగుగా ఏర్పడింది. తాబోరు కొండకు దిగువన ఉన్న షునేము పట్టణం కనిపించింది. తను ఇప్పుడు చూస్తున్న ఈ మార్గంలో కుమారుని పోగొట్టుకొనిన ఘనురాలైన షునేమీయు రాలు దుఃఖంతో గాడిద మీద వస్తున్నట్లు అనిపించింది. ఇప్పుడు పైకి చూస్తే గుహలు రెండు మాత్రమే కాక చాలా కనిపించాయి. మనుష్యులు ఎవరూ ఆ గుహలలో నివసించుట లేదని తెలుస్తూనే ఉంది. కాకపోతే అక్కడక్కడ మంద కాపరులు కనిపించారు. ఇప్పుడు హైయిఫా సముద్రం ఏమీ కనిపించ లేదు. అక్కడ నుండి తను నడచి వచ్చిన బాట కనిపిస్తుంది. దూరంగా కనిపించే ఆ పానశాలకు తూర్పుగా రోమీయుల నివాసములు. అంటే ఇక్కడ ఒక సైనిక స్థావరం ఉంది అనుకున్నాడు. ఆ స్థావరం ప్రక్కనే గుర్రముల శాలలు, రథశాలలు ఉన్నాయి.

ఇప్పుడు ప్రక్కనే ఉన్న సెలయేరు చాలా సన్నగా ఉంది. అక్కడే ఒక చెట్టు క్రింద కూర్చుని వీపు మీద కట్టిన మూట దించి ఎదురుగా రాతిమీద విప్పదీశాడు. వేయించిన చేపలు, యవల రొట్టెలు, ఈ వాతావరణంలో అవి చాలా రుచి అనిపించాయి. కొన్ని కొన్ని రకాల భోజనాలు కొన్ని కొన్ని ప్రదేశాలలోనే రుచిగా ఉంటాయి అంటారు అందుకే కాబోలు అనుకున్నాడు. ఈ రొట్టెలలో యెరూషలేము సంఘము యొక్క ప్రేమ, ఆదరణ ఇమిడి ఉన్నాయి. ప్రభువుతో కలసి పట్టణాలు, పల్లెలలో దేవుని రాజ్యసువార్త ప్రకటించేటప్పుడు రొట్టెలు తయారు చేయించుకొని వెంట తీసుకొని వెళ్తుండేవారని పేతురు చెప్పిన మాట గుర్తుకు వచ్చింది. ఆయన చిత్తము లేకుండా సంతోషమైన హృదయంతో రుచిగల ఆహారం ఎవరు తిని తృప్తిపొంద గలరు? అనుకున్నాడు.

భోజనం తర్వాత చాలాసేపు ఆ గుహల ప్రాంతాలను చూస్తూ తన ఊహలలో ఏలియాగారు ఆకాశము నుండి అగ్ని రప్పించి దహనబలి పశుమాంసమును దహింపజేసిన స్థలం, షునేమీయురాలు ఎలీషాగారిని కలుసుకున్న స్థలము లను తను చూచినట్లు తృప్తి పొందాడు.

నాల్గవజాములో ప్రవేశిస్తుండగా తన ప్రార్థన ముగించి క్రిందకు దిగి, రేవు పట్టణానికి నడక సాగించాడు. షునేము బాట నుండి రాచబాటలో ప్రవేశించిన తర్వాత, తన ఆలోచన లన్నీ కర్మేలు నుండి తార్సు వైపుగా మళ్ళినవి. ఇప్పుడు తార్సు పట్టణంలో భార్య స్నేహితులు, ఏ విధంగా తనను స్వీకరిస్తారో మరచిపోదామనుకొన్నప్పటికీ, ఆ భావన తనను వెంటాడు తూనే ఉంది.

ఓడ యొద్దకు చేరేటప్పటికి సూర్యుడు పూర్తిగా అస్తమిం చాడు. సిసారియా పట్టణం చీకటిలోనే ఉన్నట్లు అనిపిస్తుంది.

ఓడలో తన గదిలో ప్రవేశించి విశ్రాంతిగా కొంచెం నడుం వాల్చాడు. తార్సు పట్టణం, తన గృహం, భార్యాపిల్లలందరూ తన కళ్ళెదుటే ఉన్నట్లుగా, వారి ప్రశ్నల పరంపర,

ఆలోచిస్తుంటే తలుపు తట్టిన శబ్దం వినబడింది. తలుపు తీసినప్పుడు ఎదురుగా ఒక సుపరిచితుడైన వ్యక్తి కనిపించాడు. కాని ఎవరైనది? అతని పేరు గుర్తుకు రాలేదు. తన మతి మరుపు ఇటువంటి సన్నివేశములోనే సిగ్గుపడవలసి వస్తుంది.

"తార్సు కదూ!" అని అడిగాడు.

సౌలు ఆలోచిస్తూ "ఔను" అన్నాడు.

"సౌలూ..." అన్నాడు మళ్ళీ.

అతని హృదయంలోని మార్దవం అతని స్వరమే చెప్తుంది. సంతోషంతో ఒళ్ళు పులకరించి కౌగలించుకొన్నట్లుగా దగ్గరకు వచ్చి సౌలు చేతులు పట్టుకొని ఇద్దరు మంచం మీద కూర్చున్నారు. యూలి తన వెంబడి వచ్చిన ఇద్దరు సైనికులకు సైగచేశాడు. వారు నమస్కారము చేసి వెనక్కి వెళ్ళిపోయారు.

"సైనిక దుస్తులలో ఇంతకు ముందు మిమ్మును చూశాను. అందువల్ల మామూలు దుస్తులలో మిమ్ము వెంటనే గుర్తించలేక పోయాను, క్షమించండి" అన్నాడు సౌలు.

"లేదు, మనది కొద్ది పరిచయము. అది నాలుగు సంవత్సరాలు దాటిపోయినది. అయినా మీరు జ్ఞాపకం ఉంచుకున్నారు. ఇది చిన్నవిషయం కాదు" అన్నాడు యూలి.

"మీరు నజరేయుని సిలువ సమయాన అక్కడ ఉన్నారట కదా!" అడిగాడు సౌలు.

"ఔను, ఉన్నాను" అని మాట మార్చుతూ...

"ఈ రేవులో సుంకము వసూలు మీద పర్యవేక్షణాధికారిగా, అంటే సహస్రాధిపతిగా ఉన్నాను. ఈ ఓడ రేవుగా వెళ్ళే ప్రతి ప్రయాణికుని వివరాలు మాకు తెలుపబడతాయి. ఈ రోజు తార్సు వెళ్ళే జాబితాలో "తార్సువాడైన సౌలు" అని ఉంది. కనుక మీరే ఎందుకు అయి ఉండకూడదు అనుకున్నాను. మిమ్ములను కలుసుకోగలగటం దేవుని కృపే" అన్నాడు యూలి. "మీ గురించి నేను విన్నది, ఆ సిలువ యొద్ద మీరు యేసుని అంగీకరించినది, అంతా చేశారా?" అడిగాడు సౌలు.

యూలి కొంచెం తీరుబడిగా వేరే పీట మీద కూర్చుని "మీ ఓడ రేపు ఉదయం బయలుదేరుతుంది. మనం అలా బయటకు వెళ్దాము పదండి" అన్నాడు. ఇద్దరు కలిసి రేవు దాటి కర్మేలు వైపుగా నడుస్తున్నారు. చల్లనిగాలి సముద్రం మీద నుండి వచ్చినా చలి వెయ్యలేదు. ఇంతకు ముందు ఒంటరిగా చేసిన ప్రయాణం ఎంత బరువుగా ఉందో, ఇప్పుడు సహవాసంతో వుండే సంతోషం తృప్తిగా కనిపించింది.

"పస్కా పండుగకు..." అంటూ ప్రారంభించాడు యూలి. "పస్కా పండుగకు సిసారియాలో ఉండే పిలాతు, తిబెరియ పట్టణంలో వుండే హేరోదు, యెరూషలేములోనే ఉంటారు. దాదాపు ప్రపంచంలో అన్ని దేశాల నుండి యూదులు యెరూషలేముకు వస్తారు. వారికి గృహవసతి అవసరం లేదు. ఎందుకంటే పర్ణశాల పండుగ ఆచరిస్తారు కదా! అందువల్ల ఆ చుట్టు ప్రక్కల వుండే అన్ని కొండల మీద పర్ణశాలలు నిర్మించుకొని, ఆ ఎనిమిది రోజులు పండుగ ఆచరిస్తారు. శాంతిభద్రతలకు వేలకొలది సైనికులను సిసారియా నుండి రప్పిస్తారు. ఇవన్నీ మీకు తెలుసు కదా!

ఈసారి పండుగ క్రొత్తగా ఉంది జనులంతా ఏదో క్రొత్త సంగతి జరుగబోతున్నది అని ఎవరికి వారే ఆలోచిస్తున్నారు. అనేకమంది నోట 'నజరేయుడు' అనే పేరు వినబడుతుంది. గలలియ ప్రాంతం ఎప్పుడూ తిరుగుబాటుదారులతో నిండి ఉంటుంది. మాకు మిల్లు కోట క్రిందభాగములో బస ఏర్పాటు చేశారు. పండుగ అంతా ప్రశాంతంగానే ఉంది.

ఆ రోజు ఉదయం మామూలుగానే పనిలో ప్రవేశించాము. నాకు, మరి నలుగురు సైనికులకు కల్వరి కొండ మీద ఆరోజు సిలువ కార్యక్రమం నిర్ణయించారు. ఉదయం ఎనిమిది గంటలకు ముగ్గురు ఖైదీలను సిలువ వెయ్యాలి అని మాకు ఉత్తర్వు అయింది. ఆ ముగ్గురు రోమా సామ్రాజ్యము మీద తిరుగుబాటు చేసిన వారు అని చెప్పారు. కల్వరి కొండ మీద నుండి పట్టణం వైపు చూస్తుంటే అకస్మాత్తుగా గొప్ప జనసమూహము దమస్కు ద్వారము గుండా పట్టణం బయటకు రావటం చూశాను. ఆ జనసమూహములో సైనికులు, బంట్రౌతులు పండుగకు ఇతర పట్టణాలు, గ్రామాల నుండి వచ్చిన వారు అనేకులు ఉన్నారు. సాధారణంగా సిలువ మరణము విధింపబడిన వానికి

సంబంధించిన వారు, అతని సిలువ వెంబడిరారు.

ఈ జనసమూహముకు చివరిలో కొంతమంది స్త్రీలు కూడా ఏడుస్తూ వెంబడిస్తున్నారు. ఇంతకుముందు ఈ సిలువ శిక్ష చాలాసార్లు అమలు జరిపాను, కాని ఈ విధమైన వెంబడింపు ఎప్పుడూ చూడలేదు. ఆ రోజు ఎందుకో బహు భారమైనదిగా కనబడింది. ఈ కార్యక్రమం సర్వసాధారణ మైనది. అయినా ఎందుకో ఆ రోజు ప్రత్యేకంగా కనబడింది. యేసు కల్వరికొండ మీదకు వచ్చినప్పుడు, నా యెదుట నిలిచినప్పుడు, పిలాతు యొక్క శిక్షాపత్రము నా చేతికి అందిచబడినప్పుడు నేను యేసు ముఖము చూశాను.

ఈ ప్రపంచములో ఏ ముఖములోనూ లేనిది, ఆది ఏదో ఆయన ముఖంలో కనిపించింది. అంత సాధువైన ముఖము ప్రపంచంలో ఎవరికీ ఉండదు అని అనిపించింది. ఆయన నా వైపు చూచినప్పుడు ఊహ తెలిసినప్పటి నుండి నేనెరిగిన ఆత్మీయునివలె నేనెరిగిన ముఖమే – యేసు అనుకున్నాను. ఆయన ముఖము ఒక్కసారి చూస్తే మళ్ళీ చూడాలనిపిస్తుంది.

అంతకుముందు నేలలో పాతి ఉంచిన సిలువ నిలువు మ్రానును బయటకు తీసి, అక్రమకారులు మోసుకొని వచ్చిన అడ్డుకర్రను దానికి బిగించి, వారి పైవస్త్రములు తొలగించే టప్పుడు ఆయన వీపు కొరడా దెబ్బలకు దున్నబడిన పొలము వలె కనబడింది. ఆయనను సిలువ మీద పడుకోమని చెప్పి నప్పుడు ఆయన తన నోరు తెరువలేదు. సీలలు దిగగొట్టే టప్పుడు అందరివలె పొలికేకలు పెట్టలేదు.

కాని బాధతో ఆయన మూల్గినప్పుడు సర్వసృష్టి ఆయనతో కలిసి మూలిగినట్లుగా తోచింది. జనసమూహ ములు కొండ మీదకు రావడానికి ప్రయత్నించారు. కాని సైనికులు అడ్డు కున్నారు. ఆయన కోసం కొందరు గుండె పగిలేటట్లు ఏడు స్తుంటే, మరికొందరు ఆయన తొందరగా సిలువలో మరణిం చడం చూడాలని, కొందరు ఆయన దయ కలిగిన మాటలు చెప్పుకుంటుంటే, మరికొందరు ఆయనను పరిహసించటం విన్నాను. ఆయనను చూచిన ప్రతి వ్యక్తి ఆయనను గూర్చి ఏదో ఒకటి అంటూనే ఉన్నారు. ఎవరీయన? ఆయన ధనవంతుడు కాదు. బీదవానివలె లేదు. తను మొట్టమొదటి సారిగా చూచినప్పటి నుండి ఆయన తన చూపుతో ఇచ్చిన సందేశాన్ని అర్థం చేసుకోడా నికి ఈ హృదయం ఎంత తపనపడినా అందుకోలేక పోతుంది. ఆయన ఇచ్చిన సందేశాన్ని అర్థం చేసుకొనే వరకు ఈ భూమి మీద ఏ వ్యక్తి అయినా సమాధానంగా ఉండలేదు.

ఆ కల్వారి మీద నాకు పై అధికారి లేనందున సరి పోయింది. కాని ఎవరైనా సహస్రాధిపతి ఉంటే నా బాధ్యతా రహిత ప్రవర్తనకు నేను ఇబ్బంది పడవలసి వచ్చేది. ఆయనను సిలువకు మేకులతో బిగించిన తర్వాత ఆయన నేరం నిరూపించే పలక సిలువ తలభాగమున సీలలతో బిగించు తుంటే చదివాను. 'యూదులకు రాజైన నజరేయుడైన యేసు' అని హెబ్రీ, గ్రీకు, లాటిను భాషలలో వ్రాయబడి ఉంది. అది చదవగానే నా గుండె వేగంగా కొట్టుకోవడం ప్రారంభిం చింది. ఈ విధమైన నేరము ఇంతకు ముందు చెప్పబడలేదు.

ఆయన ముఖం చూస్తే, ఆయన రాజే. సిలువ మీద నుండి కూడా రాజ్యపాలన చెయ్యగలడు అనుకున్నాను". అంతవరకు మాట్లాడిన తర్వాత యూలి సౌలువైపు చూశాడు.

"ఆయనను ఒక్కసారి చూస్తే ఆయన చూపు మనం మరణించే వరకు మన వెంబడి ఉంటుంది" అన్నాడు సౌలు.

తరువాత ఇద్దరూ లేచి నిలుచున్నారు. యూలి తన ఇంటివైపుగా దారి తీశాడు. సౌలు మౌనంగా అతన్ని వెంబడించాడు. రాత్రి అయినా వచ్చి పోయే మనుష్యులను గుర్తించగలిగే వెలుతురు ఉంది. యూలి ఇప్పుడు సైనిక దుస్తులలో లేకపోయినా, ఎదురైన వారిలో అనేకులు ఆయనకు అభివందనం చేస్తూ వెళుతున్నారు. ఓడలో కదలికగా ఉండిన సౌలు ఇప్పుడు మళ్ళీ నూతన తేజముతో ఉత్సాహముగా ఉన్నాడు. నాలుగు రహదారుల కూడలిలో ఉన్న పానశాల దాటిన తర్వాత సైనికుల నివాసములు దీపములతో వెలుతురుగా ఉన్నవి. అక్కడ ఉన్న సైనికులు యూలికి వందనము చేసి తర్వాత సౌలుకు కూడా వందనము చేశారు. ఇద్దరు కలసి లోపలికి వెళ్ళిన తర్వాత ఇద్దరు సేవకులు వచ్చి పానియములు ఇచ్చారు. యూలి కుటుంబము రోమా పట్టణములోనే ఉంది. **(సశేషం)**

# అతి పెద్ద ధాన్యపు గింజ

## (లియో టాల్‌స్టాయ్)

**కొండలలో లోయలలో ఆడుకుంటున్న** పిల్లలకు మధ్యలో చీలినట్లుగా కనిపిస్తున్న ఓ కోడిగ్రుడ్డు వంటి ఆకారమున్న వస్తువు దొరికింది. ఆ దారిన పోతున్న ఓ బాటసారి దానిని ఒక రూపాయికి పిల్లల దగ్గర నుండి కొని ఆ దేశపు రాజుగారికి అమ్మివేశాడు.

అది ఏమిటో తెలుసుకోవాలనే ఇచ్ఛతో ఆరోజు దానిని తన సంస్థానములోని జ్ఞానులను పిలిపించి , వారికి చూపించి ఇది ఏ రకమైన వస్తువో తెలుసుకొమ్మన్నాడు. వారు ఎంత ఆలోచించినా తలాతోక తెలియలేదు. దానిని ఓ కిటికీ మీద ఉంచితే ఓ కోడిపెట్ట వచ్చి దానిని పొడిచి, రంధ్రము చేసింది. అప్పుడు అక్కడున్నవారందరికి అది ఓ రకమైన గింజ అని తెలిసింది. వారు రాజు వచ్చి "అది ఓ రకమైన ధాన్యపు గింజ" అని చెప్పారు.

అప్పుడు రాజుగారు చాలా ఆశ్చర్యపోయి "అటువంటి ధాన్యమును ఎప్పుడు, ఎక్కడ పండించారు?" అని ఆ జ్ఞానులను తెలుసుకోమన్నాడు.

ఆ జ్ఞానులు తమ పుస్తకాలు పరిశోధించినా కనుగొనలేకపోయారు. వారు రాజుగారి దగ్గరకు వచ్చి – "మేమేమి కనుగొనలేకపోయాము, మా గ్రంథాలలో దీని విషయం ఏమీ వ్రాయబడలేదు" అని అన్నారు.

"కనుక మీరు వ్యవసాయము చేసే రైతులను అడిగితే వారు వారి పితరుల ద్వారా ఇటువంటి గింజలను గూర్చిన సమాచారము ఏదైనా ఇటువంటిది తిన్నారేమో తెలుస్తుంది" అని రాజుతో అన్నారు.

కాబట్టి రాజు తన సేవకులలో బాగా వయస్సు ముదిరిన రైతును ఒకరిని వెదకితెమ్మన్నారు. ఆ సేవకులు అటువంటి వ్యక్తిని వెదకి రాజువద్దకు తెచ్చారు. అతను చాలావృద్ధుడై వంగిపోయి పళ్ళు ఊడిపోయి, రెండు కర్రలు చంకల క్రింద పెట్టుకొని నిదానంగా రాజు వద్దకు వచ్చాడు. రాజు ఆ విత్తనమును అతనికి చూపించాడు. అతని చూపు సరిగా లేదు అందువలన తనచేతిలోనికి తీసుకొని వ్రేళ్ళతో తడిమి చూశాడు.

"పెద్దాయనా! ఇటువంటి గింజలను నువ్వెప్పుడైన చూశావా?" అని రాజు అడిగాడు.

"దానిని ఎప్పుడైన కొన్నావా? లేక నీ పొలంలో పండించావా?" అని అడిగాడు.

ఆ ముసలివానికి రాజు మాటలు వినబడనంత చెవుడు. అయినా అతికష్టం మీద అర్థం చేసుకున్నాడు.

"నేను ఇటువంటి గింజలను ఎన్నడు చూడలేదు. కొనలేదు. పొలంలో చల్లలేదు రాజా! నేను వ్యవసాయము చేసినప్పుడు గింజలు ఇప్పుడున్నట్లుగానే ఉండేవి" అన్నాడు.

"అయితే మా తండ్రిని మీరు అడగండి ఒకవేళ ఆయన ఇటువంటి గింజల గురించి విని ఉండవచ్చును" అన్నాడు.

వెంటనే రాజు అతని తండ్రిని తీసికొని రమ్మని పనివారిని పంపించాడు .

అతను చంకలో ఒక కర్రమాత్రం పోటీగా పెట్టుకొని నడుస్తూ వచ్చాడు. రాజు అతనికి ఆ గింజను ఇచ్చాడు. అతను ఆ గింజను తీసుకొని జాగ్రత్తగా చూసాడు.

"ఈ గింజలు ఎక్కడ పండించారో నీవు చెప్పగలవా? నీ వెప్పుడైనా ఇటువంటివి కొన్నావా? ఎప్పుడైనా నీ పొలములో పండించావా?" అని అడిగాడు రాజు.

అతనికి కొంచెం చెవుడు ఉండినా తన కుమారుని కంటే తక్కువ చెవుడు.

అతను రాజుతో – "నా పొలములో ఇటువంటి గింజలను నేనెప్పుడు పండించలేదు. నేనెప్పుడు వీటిని కొనలేదు. మా రోజులలో డబ్బు అనే మాట వాడుకలో

లేదు. ప్రతి ఒక్కరు ఏదో ఒక పంట పండించేవారు. ఏదైనా అవసరమొస్తే పంచుకొనేవారు. ఇటువంటి ధాన్యము ఎక్కడ పండుతుందో నాకు తెలియదు. మా ధాన్యము మా రోజుల్లో ఇప్పటి ధాన్యము కంటే పెద్దదిగాను ఎక్కువ పిండిని ఇచ్చేది. అయితే ఇటువంటి గింజను నేనెప్పుడు చూడలేదు" అన్నాడు.

"అయితే నా తండ్రి కాలములో గింజలు చాలా పెద్దనిగాను ఎక్కువ పిండి ఇచ్చేవిగా ఉండేవని మా తండ్రి చెపుతుండేవాడు. కనుక మా తండ్రిగారిని మీరు అడగండి" అన్నాడు.

అప్పుడు రాజు తన సేవకులకు పంపించి ఇతని తండ్రిని పిలుచుకొని రమ్మన్నాడు. అతను నడవటానికి చంకలలో ఎటువంటి పోటీపెట్టుకోకుండా రాజు దగ్గరకు ఠీవీగా వచ్చాడు. అతనికి దృష్టిలోపము, వినికిడి లోపము లేదు. మాటలు స్పష్టంగా ఉన్నవి. రాజు తన చేతిలోని గింజను ఆ వృద్ధునికి ఇచ్చాడు. అతను ఆ గింజను పరీక్షగా తిప్పిచూసి "ఇటువంటి గింజను నేను చూసి చాలా సంవత్సరాలు గడచిపోయినవి. ఆ గింజను కొంచెం కొరికి తిని, ఇది నిజంగా చాలా మంచి గింజ" అన్నాడు.

"ఈ గింజలు ఎక్కడ , ఎప్పుడు పండించారో చెప్పు తాత" అన్నాడు రాజు. "నీవెప్పుడైన ఈ గింజలు కొన్నావా? పొలంలో పండించావా?" అన్నాడు.

"మా రోజుల్లో ఈ విధమైన ఈ గింజలు ప్రతిచోట పండేవి. నేను యౌవనస్తునిగా ఉన్నప్పుడు మేము ఇవే ఆహారంగా తీసుకొనేవారము. వీటినే పొలంలో విత్తి పంట కూర్చేవారము" అన్నాడు.

"నీవు ఈ గింజలను కొనేవాడివా? పండించేవాడివా?" అన్నాడు రాజు.

తాత రాజుని చూసి నవ్వాడు. "మా రోజుల్లో ఎవరూకూడ ఆహారం అమ్మటం, కొనటం వంటి పాపము చెయ్యలేదు. డబ్బు అంటె ఏమిటో మాకు తెలియదు. ప్రతి ఒక్కరి దగ్గర వారికి సరిపోయేంత ధాన్యము ఉండేది ఆనాడు" అని చెప్పాడు.

అప్పుడు రాజు "మీ పొలము ఎక్కడ ఉన్నది? మీరు గింజలను ఎక్కడ పండించేవారు?" అన్నాడు రాజు.

"మా పొలములు దేవుని నేల. మేమెక్కడ దున్నితే అదే మా పొలము. భూమి ఉచితముగా దొరికేది. ఎవరూ కూడ ఈ భూమి నాది అని అనరు. కష్టించి పనిచేసేదే ప్రతి మనిషికి సొంతము" అని చెప్పాడు.

"ఇంకా రెండు ప్రశ్నలకు జవాబు చెప్పు తాత.

ఈ భూమి ఇటువంటి గింజలను ఇవ్వకుండా ఎందుకు మానివేసింది?

రెండవ ప్రశ్న – నీ కుమారుడు చంకలో ఒక కర్ర మాత్రమే ఆధారము చేసుకొని నడుస్తుంటే...నీ మనుమడు రెండు కర్రలు ఆధారంగా చేసుకొని నడుస్తున్నాడు. నీవైతే ఏ ఆధారము లేకుండా ఎలా నడువగలిగావు. నీ కండ్లు మెరుస్తున్నాయి. నీ పళ్ళు దృఢంగా ఉన్నాయి. నీ మాట స్వచ్ఛముగా ఉన్నది. నీవు బాగా వినగలుగుతున్నావు. ఇది ఎలా సంభవము?" అడిగాడు రాజు.

అప్పుడు తాత – "ఎందుకంటే మానవులు వారి పనులు వారే చేసుకోవటం మానివేశారు. ఇతరుల కష్టం మీద బ్రతకడం అలవాటు చేసుకొన్నారు.

**పూర్వకాలములో మానవులందరు దేవుని చట్టప్రకారం జీవించారు. వారికున్నదే వారిది. ఇతరులనుండి ఆశించేవారు కారు" అన్నాడు.**

## ఎసర్హద్దోను - రాజైన అసారుద్దిన్

**ఎసర్హద్దోనను బైబిలులో రెండవ రాజులు 19:37లోను,** యెషయా 37:38లోను, ఎజ్రా4:2లోను పలుకరించారు. మనష్షె రాజును బంధించు కొనిపోయిన అష్షూరు రాజుగా రెండవ దినవృత్తాంతముల గ్రంధము 28:11లో పలుకరించారు. మనష్షెను సంకెళ్ళతో బంధించి బబులోనునకు కొనిపోయినారు. రాజు మరణించకముందే తన కుమారునికి రాజ్యము అప్పగించినట్లుగా బైబిలు గ్రంధములో అతనిని అస్నప్పరు అను పేరుతో ఎజ్రా 4:10లో పలుకరించారు. పై వాక్యాలలో మనకు అంతగా చరిత్ర

తెలుపకపోయినను ఎసర్హద్దోను చరిత్ర అనే పేరుతో ఎర్నస్టు ఎ.బడ్జి వ్రాసిన విధముగా – లాయిల్లా అనే రాజును ఎసర్హద్దోను పట్టుకొనినపుడు దేవుడ్ని ఎసర్హద్దోను వేడుకొని నందున అతని విన్నపములకు మన్నింపు దొరికినది. అప్పుడు ఎసర్హద్దోను లాయిల్లాను సహోదరునిగా భావించి బాజు నగరాలను ఏలుటకు ఇచ్చాడు అన్నాడు.

అష్షూరురాజైన ఎసర్హద్దోను లాయిల్లా రాజును యుద్ధములో ఓడించి అతని పట్టణాలను పల్లెలను తగులబెట్టి అందలి ప్రజలను ఖైదీలుగా తన దేశమునకు తీసుకొనివెళ్ళి అందలి సైనికులను వధించి పట్టణ ప్రముఖుల తలలు కొట్టించి, కొందరిని నూనెలో వేయించి, రాజైన లాయిల్లాను ఇనుప పంజరంలో బంధించాడు. ఒక రోజు రాత్రి తన మంచము మీద పండుకొని తన బంధీయైన లాయిల్లాను ఏవిధంగా క్రూరంగా చంపాలి అని ఆలోచించుకొంటుంటే సన్నని ఈలవంటి శబ్దం వచ్చింది. తలత్రిప్పి అటు చూస్తే పొడవైన వెంట్రుకలు, దీనమైన కండ్లు కలిగిన వృద్ధుడు కనిపించాడు. “నీవు లాయిల్లాను చంపాలని ఆలోచిస్తున్నావు కదా?” అని ఆ ముసలి అడిగాడు.

“నిజమే! కాని ఎలా చంపాలి అనే విషయం నిర్ణయానికి రాలేకపోతున్నాను” అన్నాడు రాజు.

“కాని నువ్వే లాయిల్లావి” అన్నాడు వృద్ధుడు.

“అది నిజంకాదు. ఎందుకంటే లాయిల్లా లాయిల్లానే – నేను నేనే” అన్నాడు రాజు.

“నీవు, లాయిల్లా – ఒకటే, కానీ నువ్వు – అతను వేరు, నువ్వు వేరు అనుకొంటున్నావు” అన్నాడు వృద్ధుడు.

“అదెలా కుదురుతుంది? నేను ఇప్పుడు ఈ రత్న తల్పము మీద హాయిగా పండుకున్నాను. నా దగ్గర ఆడ బానిసలు, మొగ బానిసలు ఉన్నారు. ఈ రోజు జరిగినట్లుగానే రేపు నేను గొప్ప విందు చెయ్యబోతున్నాను. నా స్నేహితులందరు వస్తారు. కాని లాయిల్లా పక్షిలాగా పంజరంలో కూర్చుని ఉన్నాడు. రేపు నేను అతనిని నూనెలో వేయిస్తాను. అతని నాలుక బయటకు వస్తుంది. చస్తాడు. అప్పుడు అతని శరీరాన్ని కుక్కలకు ఆహారంగా వేస్తాను” అన్నాడు రాజు.

“నీవు ఒక జీవాన్ని నాశనం చెయ్యలేవు” అన్నాడు వృద్ధుడు. “అట్లయితే నేను వేలమంది శత్రుసైనికులను చంపి పెద్ద కుప్పగా వేశాను. వారెవరు ఇప్పుడు లేరు.
నేను బ్రతికివున్నాను కదా! నేనెందుకు జీవములు తీయలేదు?” అన్నాడు.
“వాళ్ళు ఇప్పుడు లేరని నీవెట్లా అనుకుంటున్నావు?” అన్నాడు వృద్ధుడు.

“కాని వాళ్ళు ఇప్పుడు లేరుగా. వాళ్ళు హింసించబడి చనిపోయారు” అన్నాడు రాజు.

“అని నీవు తలంచుచున్నావు కాని నీవు వారిని హింసించలేదు. నిన్ను నీవే హింసించుకున్నావు” అన్నాడు.

“నాకు అర్థం కావడంలేదు” అన్నాడు రాజు.

“నీకు అర్థం చేసుకోవాలని ఉందా?” అన్నాడు.

“అవును” అన్నాడు రాజు.

“అయితే నాతో అక్కడికి రా!” అని నీళ్ళతో నిండి ఉన్న ఒక తొట్టిని చూపించాడు. రాజు అతనితో కలిసి తొట్టివైపుకు నడచి వచ్చిన తర్వాత “నీవు ఆ తొట్టిలో దిగు” అన్నాడు.

ఎసర్హద్దోను అతను చెప్పినట్లు చేశాడు.

“నేను ఈ నీళ్ళు నీమీదకు పోసేటప్పుడు నీవు ఆ కుండను నీళ్ళతో నింపి నీ తలను అందులో ముంచు” అన్నాడు.

రాజు అలానే చేశాడు. రాజు తలమీద నీరు పడగానే ఎసర్హద్దోనుకు తాను ఎసర్హద్దోను కాను, వేరేవాడిని అనిపించింది. అలా అనుకొంటుండగానే ఒక గొప్ప మంచము మీద పండుకొని ఉన్నట్లు ఓ అందమైన స్త్రీ తన ప్రక్కన ఉన్నట్లు గమనించాడు. ఇంతకుముందు ఆమెను తను ఎన్నడు చూడలేదు. కాని ఆమె తన భార్య అనుకున్నాడు.

ఆమె – “లే, లాయిల్లా రాజా! నిన్న మీరు చాలా అలిసిపోయి నందున మంచి నిద్రపోయారు. మీకు నిద్రాభంగము కలుగకుండా ఇంతవరకు నేను చూస్తున్నాను. చాలాసేపు నిద్రించారు. ఇక లేవండి! మీకొరకు రాజపుత్రులు దర్బారులో వేచివున్నారు” అన్నది.

**(సశేషం)**

చిన్నపిల్లల పేజి

# క్యాసబియాంకా

కథ అనగానే శరీరం ఎంతో పులకరిస్తుంది. ముఖ్యంగా చిన్నబిడ్డలకు ఎంత సంతోషమో! అయితే ప్రతి కథలోను ఒక నీతి ఉంటుంది. కథ విన్న తరువాత కథ మర్చిపోయనా నీతిని మర్చిపోకూడదు. చిన్నపిల్లలలో ఉండవలసిన ముఖ్య మైన సుగుణం విధేయత. దీని గురించి జరిగిన కథ ఒకటి చెప్తాను జాగ్రత్తగా వినండి.

1800 సంవత్సరంలో వ్యాపారమంతా ఎక్కువగా ఓడలలోనే జరుగుతూ ఉండేది. అప్పుడప్పుడే పెద్ద పెద్ద ఓడల తయారి మొదలయింది. ఎక్కువ మంది ఓడలలో పని చేయడానికి ఇష్టపడుతూ ఉండే వారు.




ఆ దేశములో టిపాలిన్ అనే ఊరిలో కాంగిలిన్ అనే వ్యక్తి నివ సిస్తూ ఉండేవాడు. అతనికి ఒక్కడే కుమారుడు. పేరు క్యాస యాంకా. భార్య ఆ బిడ్డను కని చనిపోయింది. కనుక మరలా పెండ్లి చేసికోకుండా ఆ బిడ్డను గారాభంగా పెంచుతూ వచ్చాడు. ఎక్కడికి వెళ్ళినా కుమారు డిని కూడా వెంట తీసుకొని వెళ్ళేవాడు.

ఇలా ఉండగా కాంగీలిన్‌కి ఓడలో పని కుదిరింది. ఓడలో పని వారికి గదులు ఉంటాయి. కాబట్టి కాంగీలిన్ తన కుమారుడు క్యాసబియాంకని కూడా తీసుకొని వెళ్ళేవాడు.

అయితే ఓడలోని వాళ్ళ చెడుసావాసములవల్ల కాంగీలిన్ త్రాగుడు, జూదము మొదలైన చెడు అలవాట్లకు లోనై కుమారుని సరిగా పట్టించుకునే వాడు కాదు. అంతకు ముందు తనని ఎంతో ప్రేమగా చూసే తండ్రి ఇప్పుడు సరిగా ప్రేమించడం లేదని పది సంవత్సరముల క్యాసబి యాంకాకు అర్థమయింది. కాని ఎప్పుడు కూడా తండ్రి మీద అలిగే వాడు కాదు. ఎప్పుడు తండ్రి మాట జవదాటే వాడు కాదు.

ఒకరోజు రాత్రి వాళ్ళ నాన్న బాగా తాగి గదికి వచ్చాడు రాత్రి 11 గంటలు అయింది. కుమారుడు ఒక్కడే క్రింద పండుకొని నిద్రపోతున్నాడు. కుమారుడిని లేపి భోజనము చేశావా అని అడిగాడు. లేదు నాన్న నువ్వు లేకుండా నేనెప్పుడైనా తిన్నానా అని చెప్పాడు. అప్పుడు తండ్రికి గుర్తుకొచ్చింది తాను ఆ రోజు మధ్యాహ్నం కూడా గదికి రాకుండా అక్కడే ఓడలోని బార్‌లో పేకాట ఆడుతూ తిని తాగుతూ ఉన్నాడని. కుమారుని మీద చాలా దిగులేసింది. పాపం పొద్దుట నుండి అన్నం తిన కుండా పసివాడు ఆకలికి ఎంత అలమటించాడో అని చాలా దిగులువడ్డాడు. కుమారుని గట్టిగా కౌగలించుకొని ముద్దుపెట్టుకొని కన్నీళ్ళ పర్యంతమయ్యాడు. ఛీ ఈ వెధవ త్రాగుడు, జూదము వలననే గదా నా కుమారుని ఇంత క్షోభపెట్టాను అని ఇకమీదట ఈ త్రాగుడు జూదము మాని వేస్తాను అని మనసులో అనుకున్నాడు. అంతలోనే కుమా రుడు నాన్న, నీ దగ్గర ఈ మధ్యకాలంలో చాలా చెడ్డ వాసన వస్తుంది. నీవు ముద్దు పెట్టుకుంటే నాకు వాంతికి వచ్చినట్లు ఉంది. నీవు ఇక తాగవద్దు నాన్న అని తండ్రిని గట్టిగా కౌగలించుకున్నాడు. తండ్రి మనస్సు కరిగిపోయింది. అంతకుముందే ఆ తీర్మానం చేసుకున్నాడు కనుక నాన్న ఇక త్రాగనే త్రాగను నీ మీద ఒట్టు అని ఒట్టు పెట్టు

కున్నాడు. ఇద్దరూ సంతోషంగా భోజనం చేసి నిద్ర పోయారు. ఉదయాన్నే పనికి వెళ్తూ కుమారునికి టాటా చెప్పి అయ్యా! రూములో నుండి బయటకు రావద్దు వాతావరణం సరిగా లేదు. తుపాను వచ్చే సూచనలు ఉన్నాయి జాగ్రత్త అని చెప్పి, పనికి వెళ్ళిపోయాడు తండ్రి.

కేసబియాంకా గదిలో కూర్చుని పజిల్ గేమ్ ఆడు కుంటున్నాడు. దాదాపు మధ్యాహ్నం 11 గంటల సమ యంలో పెద్ద శబ్దం అయింది. ఓడ అంతా పెద్ద కుదుపుతో ఊగిసలాడింది. కేసబియాంకాకి ఎంతో భయం వేసింది నాన్న చెప్పినట్లు తపాను వచ్చిందా? పిడుగులు పడ్డాయా అని కిటికీలో నుండి చూశాడు. ఆకాశం నిర్మలంగా ఉంది. కాని బయట ఒకటే కలవరం. ఓడలోని వారు కేకలు వేస్తూ అటు ఇటు పరుగెత్తుతున్నారు. ఏమి జరుగుతుందో తెలియదు. అటు పరుగెత్తుతున్న మనుష్యుల్ని ఏమిటి ఏమి జరుగుతుందని కిటికీలో నుండి ప్రశ్నించాడు. బాయిలర్ పేలిపోయింది. ఓడ తగలబడిపోతుంది అని చెప్పి పరుగెత్తారు. కేసబియాంకాకు చాలా భయమేసింది. నాన్న, నాన్న అని అరవటం మొదలుపెట్టాడు. వాళ్ళ నాన్న బాయి లర్ దగ్గరే పనిచేసేది. ఆ బాయిలర్ పేలినప్పుడు వాళ్ళ నాన్న చనిపోయాడని ఆ పసివాడికి తెలియదు. ఆ పిల్లవాని కేకలు విని పరుగెత్తే వారు ఆగి 'మీ నాన్న ఎక్కడో ఒక చోట ఉంటాడు, నువ్వు ముందు బయటకు వచ్చేసెయ్యి, అందరూ లైఫ్‌బోట్లలో పారిపోతున్నారు, ఆలస్యమైతే నీకు స్థలముండదు' అని చెప్పారు. కానీ కేసబియాంకా 'మా నాన్న పిలిచే దాకా రావద్దు అన్నాడు' అని సమాధానం చెప్పాడు. ఇంక ఆ తరువాత ఎవరూ ఆ పిల్లవాడ్ని పట్టించు కోవటం లేదు. ఎవరి ప్రాణాలు వారు దక్కించుకోడానికి పారిపోతున్నారు. మంటలు పైదాకా వచ్చేశాయి. కేసబి యాంకా గది కూడా తగలబడుతుంది. నాన్న రమ్మంటావా అని పెద్దగా అరవటం మొదలుపెట్టాడు. కానీ ఏ జవాబు లేదు. అంతలోనే ఓడ కెప్టెన్ వచ్చాడు. ఆ పిల్లవాని అరుపులు విని కిటికీలో నుండి చూసి, ఓ పిచ్చివాడా, తొందరగా బయటకు రా అని అరచి చెప్పాడు. మా నాన్న పిలిచేదాకా బయటకు రావద్దని చెప్పాడు అని సమాధానం చెప్పి నాన్నా బయటకు రమ్మంటావా అని అరిచాడు. ఓడ కెప్టెన్‌కి చాలా దిగులు వేసి తలుపు పగులగొట్టమని అక్కడ వున్న వారికి చెప్పాడు. కానీ ఎవరూ ఆయన మాట వినలేదు. పెద్ద దూలాలు విరిగి మీద పడుతున్నాయి. ఓడ అంతా తగలబడిపోతుంది. కేసబియాంకా గదిలోకి కూడా మంటలు ప్రవేశించాయి. నాన్న మంటలు గదిలోకి వచ్చే శాయి. చాలా వేడిగా ఉంది బయటకు రమ్మంటావా? నేను వేసుకున్న బట్టలు కూడా కాలిపోతున్నాయి, బయటకు రమ్మంటావా నాన్న... నాన్న... నాన్న... అంతే ఇక మళ్ళీ ఆ అరుపు వినబడలేదు.

ఆ ఓడ కెప్టెన్ మాత్రము ఆ ఆఖరి అరుపులు విన్నాడు. చాలామంది చనిపోయారు. కెప్టెన్‌తో సహా కొంతమంది మాత్రం తప్పించుకున్నారు. తరువాత ఆ ఓడలో చని పోయిన వారి సంతాపసభలో కెప్టెన్ కేసబియాంకా గురించి చెప్పాడు. చావులో కూడా తండ్రికి విధేయుడై యున్న బాలుడు అని. విన్నవారు అందరి కన్నులు చెమ్మగిల్లాయి. స్కూల్ పిల్లల పుస్తకాలలో ప్రచురించారు. ప్రతి ఇంట్లో కేసబి యాంకా గురించి ఇప్పుడు కూడా చెప్పుకుంటారు. చూశారా! పిల్లలూ, విధేయత వలన కేసబియాంక యొక్క కీర్తి దేశమంతా వ్యాపించి ఇప్పటికీ కథలుగా చెప్పు కుంటారు.


మన యేసుప్రభువు కూడా మరణ పర్యంతము తండ్రికి విధేయుడు. తల్లిదండ్రులకు విధేయులై ఉండుడి. ఆశీర్వాదాలు పొందండి. నీవు దీర్ఘాయుష్మంతుడగునట్లు నీ తండ్రిని తల్లిని సన్మానించు.


**ఇంటర్నెట్‌లో 'పరిశుద్ధత' మాసపత్రిక కొరకు ఈ క్రింది వెబ్‌సైట్ సందర్శించండి**

Read Our Internet Edition @

**www.holinessmagazine.com**

11



# బైబిలు చరిత్ర

**సేకరణ:** రెవ.డా॥ కె.జోసఫ్

**యాకోబు-**పరిచయం

యాకోబు ఈ పత్రికను "అన్యదేశములయందు చెదిరియున్న..." వారి నుద్దేశించి వ్రాశాడు. రచయిత ఆచరణాత్మకమైన జ్ఞానం గురించి క్రైస్తవ మనోవైఖరి గురించి క్రైస్తవ నడత గురించి వ్రాస్తూ సంపద పేదరికం శోధన సత్ప్రవర్తన దురభిమానం విశ్వాసం క్రియలు నాలుకనుపయోగించడం వివేకం వివాదాలు గర్వం వినయం విమర్శనాదృష్టి ప్రగల్భాలు సహనం ప్రార్ధన వంటి పలు అంశాలను ప్రస్తావిస్తాడు. విశ్వాసంతోబాటు క్రియలుండాలని రచయిత పేర్కొనడం ఈ పత్రికలోని విషేషాంశం.

**విషయసూచిక**

పరిచయం 1:1
విశ్వాసం, మరియు జ్ఞానం 1:2-8
పేదరికం, మరియు ఐశ్వర్యం 1:9-11
పరీక్ష, మరియు శోధన 1:12-18
వినడం, మరియు చేయడం 1:19-27
వివక్ష చూపకూడదనే హెచ్చరిక 2:1-13
విశ్వాసం, మరియు క్రియలు 2:14-26
క్రైస్తవుడు, మరియు నాలుక 3:1-18
క్రైస్తవుడు, మరియు లోకం 4:1-5:6
పలు సూచనలు 5:7-20

**1 పేతురు-**పరిచయం

చిన్నాసియాలోని ఉత్తరభాగంలో చెల్లాచెదరైన "ఏర్పరచబడినవారికి" పేతురు ఈ పత్రిక వ్రాశాడు. విశ్వాసాన్నిబట్టి శ్రమలు హింసలు అనుభవిస్తున్నవారికి ధైర్యం ఆదరణ నిరీక్షణ కలిగించడం ఈ పత్రిక ముఖ్యోద్దేశం. శ్రమలు హింసలు విశ్వాసానికి పరీక్షలని, వాటిని సహించినవారికి యేసు ప్రత్యక్షమైనప్పుడు "వాడబారని మహిమ కిరీటము" లభిస్తుందని రచయిత ప్రస్తావించడం ఈ పత్రికలో విశేషాంశం.

**విషయసూచిక**

పరిచయం 1:1-2
దేవుని రక్షణ గురించి జ్ఞాపకం చేయడం 1:3-12
పవిత్ర జీవనం గురించి సూచనలు 1:13-2:10
శ్రమలో క్రైస్తవుని కర్తవ్యం 2:11-4:19
క్రైస్తవ దీనత్వం, మరియు సేవ 5:1-11
ముగింపు 5:12-14

**2 పేతురు-**పరిచయం

పేతురు తొలితరం క్రైస్తవుల నుద్దేశించి ఈ పత్రిక వ్రాశాడు. అబద్ధ బోధలను, వాటి ఫలితమైన అనైతిక జీవనాన్ని వ్యతిరేకిస్తూ ఈ సమస్యలన్నిటికీ ఏకైక పరిష్కారం దేవుని గురించి ప్రభువైన యేసు క్రీస్తు గురించి నిజమైన జ్ఞానాన్ని కలిగి వుండడమని రచయిత ఈ పత్రికలో ప్రస్తావించాడు. రచయిత క్రీస్తు రాకడకు గల ఆలస్యాన్ని వివరిస్తూ "యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు'' పొందాలని దేవుడు కోరుకుంటున్నాడని చెప్పడం ఈ పత్రికలోని విశేషాంశం.

**విషయసూచిక**

పరిచయం 1:1-2

క్రైస్తవుని పిలుపు 1:3-21
అబద్ధ బోధకులు 2:1-22
క్రీస్తు చివరి రాకడ 3:1-18

**1యోహాను**-పరిచయం

దేవునితోను ఆయన కుమారుడైన యేసు క్రీస్తుతోను సహవాసం కలిగి వుండాలని ప్రోత్సహిస్తూ, ఈ సహవాసాన్ని పాడు చేసే అబద్ధబోధల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తూ యోహాను ఈ పత్రిక వ్రాశాడు. యేసును నమ్మి దేవుణ్ణి ప్రేమించే వారందరూ తప్పక సాటివారిని ప్రేమించాలని రచయిత ప్రస్తావించడం ఈ పత్రికలోని విశేషాంశం.

**విషయసూచిక**

పరిచయం 1:1-4
వెలుగు, మరియు చీకటి 1:5-2:29
దేవుని పిల్లలు, మరియు అపవాది పిల్లలు 3:1-24
సత్యం, మరియు అసత్యం 4:1-6
ప్రేమకున్న కర్తవ్యం 4:7-21
విజయవంతమైన విశ్వాసం 5:1-21

**2యోహాను**-పరిచయం

"అమ్మగారికిని ఆమె పిల్లలకును" అని సూచించ బడిన స్థానిక సంఘానికి రచయిత తనను "పెద్ద"గా పేర్కొంటూ ఈ పత్రిక వ్రాశాడు. క్రైస్తవుల మధ్య పరస్పర ప్రేమ వుండాలని, అబద్ధబోధకులపట్ల వారి బోధలపట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని రచయిత ఈ పత్రికలో క్లుప్తసందేశాన్నిచ్చాడు.

**విషయసూచిక**

పరిచయం 1-3 వచనాలు
ప్రధానమైనది ప్రేమ 4-6 వచనాలు
అబద్ధ బోధ గురించి హెచ్చరిక 7-11 వచనాలు
ముగింపు 12-13 వచనాలు

**3యోహాను**-పరిచయం

గాయు అనే సంఘపెద్దకు రచయిత తనను "పెద్ద"గా పేర్కొంటూ ఈ పత్రిక వ్రాశాడు. రచయిత గాయు చేస్తున్న పరిచర్యనుబట్టి అతణ్ణి అభినందిస్తూ దియొత్రేఫే విషయంలో జాగ్రత్తగా ఉండమని హెచ్చరించడం ఈ క్లుప్తపత్రికలోని ప్రధానాంశం.

**విషయసూచిక**

పరిచయం 1-4 వచనాలు
గాయు పట్ల అభినందన 5-8 వచనాలు
దియొత్రేఫే పట్ల విమర్శ 9-10 వచనాలు
దేమేత్రి పట్ల ప్రశంస 11-12 వచనాలు
ముగింపు 13-15 వచనాలు

**యూదా**-పరిచయం

విశ్వాసులమని చెప్పుకొనే అబద్ధబోధకుల గురించి హెచ్చరిస్తూ యూదా ఈ పత్రిక వ్రాశాడు. పేతురు వ్రాసిన రెండవ పత్రికకు ఈ పత్రికకు దగ్గరి పోలికలు న్నాయి. "పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధ నిమిత్తము మీరు పోరాడవలెనని'' రచయిత పాఠకులను హెచ్చరించడం ఈ పత్రికలోని విశేషాంశం.

**విషయసూచిక**

పరిచయం 1-2 వచనాలు
అబద్ధబోధకుల నడవడి, బోధ, మరియు శిక్ష
3-16 వచనాలు
విశ్వాసాన్ని కాపాడుకోవాలనే హితబోధ
17-23 వచనాలు
ఆశీర్వచనం 24-25 వచనాలు

**ప్రకటన**-పరిచయం

క్రైస్తవులకు వారి విశ్వాసం కారణంగా శ్రమలు హింసలు ఎదురైన కాలంలో యోహాను ఈ గ్రంథాన్ని వ్రాశాడు. పాఠకులకు ఈ గ్రంథం ద్వారా నిరీక్షణను ధైర్యాన్ని కలిగిస్తూ, రచయిత వారు శ్రమల్లోను హింసల్లోను తమ విశ్వాసాన్ని కాపాడుకోవాలని కోరుతున్నాడు. ఈ గ్రంథంలో సాదృశ్యరూపంలో కనిపించే పలు దర్శనాలను ప్రత్యక్షతలను నాటి క్రైస్తవులు అర్థం చేసుకోగలగడం గమనార్హం. దేవుని ప్రజల నెదిరించిన సాతాను అంతిమ పరాజయం, శత్రువుల అంతిమ ఓటమి, నమ్మకంగా

ఉన్నవారికి లభించే బహుమానం, క్రొత్త ఆకాశం క్రొత్త భూమి గురించిన వాగ్దానం బైబిల్లోని చివరి గ్రంథమైన ప్రకటనలో కనిపించే విశేషాంశాలు.

**విషయసూచిక**

పరిచయం 1:1-8
మొదటి దర్శనం, ఏడు సంఘాలకు లేఖలు 1:9-3:22
ఏడు ముద్రలున్న గ్రంథం 4:1-8:1
ఏడు బూరలు 8:2-11:19
ఎర్రని మహా ఘటసర్పం, మరియు రెండు క్రూర మృగాలు 12:1-13:18
వివిధ దర్శనాలు 14:1-15:8
దేవుని కోపంతో నిండిన ఏడు పాత్రలు 16:1-21
బబులోను వినాశనం, క్రూరమృగం అబద్ధ ప్రవక్త అపవాది ఓటమిపాలు కావడం 17:1-20:10
అంతిమ తీర్పు 20:11-15
క్రొత్త ఆకాశం, క్రొత్త భూమి, మరియు క్రొత్త యెరూషలేము 21:1-22:5
ముగింపు 22:6-21

## సవరణ


గత నెలలో (2016 మార్చి) పరిశుద్ధత మాసపత్రికలో "యేసు మృత్యుంజయుడే" అను శీర్షికలో 18వ పేజీ 10వ లైనులో

"అప్పుడు కూడా <u>శుక్రవారము</u> 'మహా విశ్రాంతి దినము' అని పొరపాటున ప్రచురితమైనది. అది చాలా తప్పు. పాఠకులు దయచేసి 'శుక్రవారము'కు బదులుగా **'గురువారము'** అని చదువుకోవలసి నదిగా కోరుచున్నాము. జరిగిన పొరపాటును క్షమించవలసినదిగా మనవి.

**- ఎడిటర్**

**23వ పేజీ తరువాయి....**

ఉపయోగించబడినది (1కొరింథీ. 14:19-35) సార్వత్రిక మైన సంఘమని పిలువబడుచున్న విశ్వాసుల గుంపు (ఎఫెసీ. 5:32). ఇంగ్లీషు పదము సంఘము (Church). ఇది గ్రీకు పదమైన కోస్ "KOS" అనగా దేవునికి చెందినది అని అర్థము. అప్పుడు సంఘము అనగా పిలువ బడిన వారి సమూహము మీరు లోకములో నుండి పిలువబడిన వారు. యేసుక్రీస్తుకు ప్రధానము చేయబడిన వారు. (పెరల్ మేన్ రచించిన Knowing the Doctrine of the Bible 1937). సంఘము అనేది ఈ విధముగా చెప్పబడినది. క్రీస్తు శరీరము (1కొరింథీ. 12:12-27, ఎఫెసీ. 4:4). ఇది సజీవ సాక్ష్యము. ఒక సంస్థ కాదు. యేసుక్రీస్తు జీవితము చేత బలపరచబడినది. అనేకమంది సభ్యులు కలిగినది. ఒక్కొక్క వ్యక్తి ఒక్కొక్క రకమైన పని కలిగియున్నాడు. దేవుని ఆలయము (ఎఫెసీ. 2:20-22, 1పేతురు 2:5,6) దేవుడు తన ఆత్మ ద్వారా ఆలయములో నివసించును (1కొరింథీ. 3:16,17). దేవుని ఆలయములో క్రైస్తవులు యాజకులవలె ఆత్మీయ బలులైన ప్రార్ధనలు, స్తుతి ఆరాధనలు, మంచి కార్యములను అర్పింపవలెను. క్రీస్తు యొక్క పెండ్లి కుమార్తె (2కొరింథీ. 11:2, ఎఫెసీ. 5:25-27). యేసు ప్రేమించును, జాగ్రత్త కలిగియుండును మరియు సంఘమును కాపాడును. సంఘము క్రీస్తుకు భార్యయైయుండును. ఎలాగంటే వధువు తన భర్తకు చేసినట్లుగా. సంఘము యొక్క పని యేమిటి? మానవుల రక్షణార్థమై సువార్త అందరికి ప్రకటింప బడవలెను (మత్తయి 28:19,20, 1తిమోతి 2:4) దేవునికి ప్రార్ధన, స్తుతి ఆరాధనలు సమర్పించుట (కొలస్సీ. 1:12, 1థెస్స. 5:16-18, 1పేతురు 2:9) క్రీస్తు కొరకు శిష్యులను సంపాదించుట, తర్ఫీదును ఇచ్చుట. మరియు వారు సంపూర్ణులగు దిశగా వారిని అభివృద్ధిపరచుట. అట్టి వారికి సహవాసము కల్పించుట పరిశుద్ధ త్రిత్వములో (ఫిలిప్పీ. 2:1, 1యోహాను 1:3) ఒకరికొకరు.



బ్రదర్ కె.సామ్రాట్

# మధ్యకాలము

## (ప్రవక్తయైన మలాకీ కాలము నుండి బాప్తిస్మమిచ్చు యోహాను వరకు గల మధ్యకాలములోని యూదుల చరిత్ర)

హెర్కెనస్ గొప్ప పరిపాలకుడు. ఆయన 30 సం॥లు పరిపాలించిన తర్వాత క్రీ.పూ.107లో మరణించునప్పుడు అయిదుగురు కుమారులుండినను ప్రధానయాజకత్వము, పరిపాలన తన జ్యేష్టకుమారుడైన యూదా అరిస్టోబులస్‌కు అప్పగించెను.

యూదుల చెర నాటినుండి క్రీ.పూ.107లో మొట్ట మొదటిగా కిరీటము ధరించి రాజుగా ప్రకటించుకొనిన వాడు అరిస్టోబులస్. కాని అతను బహు అనుమానము కలిగి కౄరమైన స్వభావము కలవాడై యుండెను. తన తల్లిని చెరసాలలో వేసి ఆహారము ఇవ్వకుండా ఆకలితో చనిపోవు నట్లు చేసెను. ఆంటిదోనస్ అను తమ్ముని తప్ప మిగిలిన వారినందరిని చెరసాలలో వేసెను. అయినను అతనిని క్రీ.పూ.106లో అతి ఈర్షతో హత్య గావించెను. తన క్రియలన్నిటికి తర్వాత పశ్చాత్తాపపడి, ఒకే ఒక్క సంవత్సరము పరిపాలన తర్వాత గొప్ప దుఃఖముతో తన ప్రాణమును విడచెను. కొద్ది కాలమైనను ఆంటిదోనస్ ఇతూరీయులను అదుపులో ఉంచి, వారు యూదా మతమును స్వీకరించునట్లు బలవంతము చేసెను. ఈ కాలములోనే పాంపే, సిసారియో జన్మించారు.

మరణించిన అరిస్టోబులస్ భార్యయైన సలోమె చెరలో ఉన్న అలగ్జాండర్ జొన్నానస్ అను మూడవ మరిదిని చెరలో నుండి విడిపించింది. అదే విధంగా మిగిలిన ఇద్దరిని కూడ చెఱనుండి తప్పించింది. కాని జొన్నానస్ సింహాసనమును స్థిరపరచుకొనిన తర్వాత కుట్ర చేసున్నాడన్న నెపంతో ఒక సహోదరుని చంపివేశాడు. అబ్శాలోము అనే ఆఖరు సోదరుని చేరదీస్తాడు.

క్రీ.పూ.105లో అలగ్జాండరు జొన్నానస్ తన రాజ్యమును విస్తరింపచేయవలెననుకొన్నాడు. అయితే ఈజీప్టు వారైన టొలమిస్, టొలమి లాధిరస్ గాజియన్స్‌కి సహాయము చేసినందు వలన, తన సైన్యములో సమర్ధులను పోగొట్టుకొని ఐగుప్తును స్వాధీనము చేసికొన్న క్లియోపాత్ర అండ కోరటమైనది. అందుకుగాను క్రేతును ఆమె కుమారుడైన లాధరస్‌కు అప్పగించటమైనది.

అలగ్జాండరు యొక్క దురదృష్టమును ఆసరాగా తీసుకొని అతని రాజ్యమును, అతని వశము చేసికొనవలెనని క్లియోపాత్ర యోచించింది కాని జన్మతః యూదుడైన అననీయ అనబడిన ఒక సేనా నాయకుడు, అలగ్జాండరుకు బంధువు అయినందున, ఆమె యొక్క అన్యాయపు ఆలోచనకు స్వస్థి చెప్పింది. ఆమె యొక్క కాపుదలను అలగ్జాండరుకు కలిగించాడు.

ఎలాగైతేనేమి అలగ్జాండరు యొక్క యుద్ధకాంక్ష అతనిని క్రొత్తపంథాలో నడిపించింది. అతని దేశము విదేశీ ముట్టడుల నుండి విడుదల పొందినందున అతను సిరియాకు సంబం ధించిన గదరా, అమెథస్ పట్టణమును ముట్టడించాడు. అయితే ఫిలదెల్ఫియ రాజైన ధియోదోరస్ తన సంపద నంతటిని అమెథస్‌లో దాచియుంచినందున అలగ్జాండరు మీదకి లేచి, అతని సైన్యములో పదివేలమందిని హతము చేసి, దోపుదు సొమ్మును తీసికొని క్రీ.పూ.101లో అతనిని వెనక్కి పంపించాడు.

ఈ సంఘటనలు అతనిలో ఏ మార్పు తేనందున గాజాను

తగ్గించవలెనన్న ఉద్దేశము ఆదేశ గవర్నరు యొక్క సహోదరుడైన లిసినాస్ యొక్క కుట్ర వలన ఫలవంతమైనది. అలగ్జాండరు ఆ పట్టణమును బహు కౄరముగా నాశనము చేసి అక్కడ వారిని చంపి దోచుకొనవలసినదిగా తన సైనికులకు ఆజ్ఞాపించాడు. మృగత్వముతో కూడిన ఒక విచారకరమైన దృశ్యమునకు ఆ గాజా పట్టణము జన నివాసము లేకుండునట్లు నాశనము చేశాడు.

ఈ ప్రజా సంహారము తర్వాత తన దేశమునకు తిరిగి వచ్చి గుడారముల పండుగలలో బలులు అర్పించునప్పుడు అక్కడి ప్రజలు అతనిని బహుగా అవమానించాడు. అందుకు ప్రతిగా తన సైన్యముతో ఆరువేలమందిని పౌరులను సంహరించాడు. అప్పటి నుండి అతను పిసిలియ నుండి ఆరువేల మంది యోధులను కూలికి పెట్టుకొని తన విధి నిర్వహణలో తనకు కాపుదలగా ఉంచుకొన్నాడు.

ఇదంతయు చల్లారిన తర్వాత అతను మోయాబీయుల మీదకును అమ్మోనీయుల మీదను దండెత్తి వారిని కప్పము కట్టునట్లు చేశాడు. అమెథాస్ థియోడర్ రాజు విడచినందు వలన, తన తిరుగు ప్రయాణంలో దానిని లోబరుచుకున్నాడు. అయినను తన సైన్యములో చాలా భాగము కోల్పోవుటయే కాక, గదరా పట్టణము వద్ద అరేబియా రాజైన తడస్ ఉంచిన మాటుగాండ్ల వలన తన ప్రాణమునే పోగొట్టుకొన వలసి వచ్చేది.

ఇవన్ని తన రాజ్యములో ప్రజలలో అసంతృప్తిని రేకెత్తించి కొత్త కష్టాలు కొనితెచ్చినవి. అయినను వాటన్నిటిని కనివిని ఎరుగని పైశాచిక రీతిలో అణచి వేశాడు. అతనిని ఎవరు ఎదిరించ లేకపోయారు. అతని యొక్క దుర్మార్గత ఎంత పెచ్చరిల్లిందంటే చివరికి అతని రక్తమే అతనిని నాశనము చెయ్యగలదు అనే స్థితికి వచ్చింది. చివరకు దమస్కు రాజైన డమెట్రియస్ యుచారియస్ యొక్క సహాయముతో అతనిని చుట్టుముట్టినందున తన ప్రాణ రక్షణర్థము అతను కొండల లోనికి పారిపోవలసి వచ్చింది.

అతని యొక్క దురదృష్టము వలన తను కూలికి తెచ్చుకొనిన ఆరువేలమందిలో ఎక్కువ మంది అతనిని విడిచి పెట్టారు. ఇది చూసిన డమెట్రియస్ వారిలో వారు కొట్టుకొనేటట్లుగా వారిని విడిచి వెళ్ళిపోవడము అలగ్జాండరుకు మేలుకరమైనది. ఈ యుద్ధములో అలగ్జాండరుకు అనేక మేళ్ళు కలిగినందు వలన ఈ తిరుగుబాటుదారులను జయించి వారిని బెతూన్ పట్టణము నుండి యెరూషలేము తీసుకొని వచ్చాడు. వారి పిల్లలను భార్యలను వారి కళ్ళ ఎదుటే చంపిన తరువాత వారందరిని ఒక్కరోజునే సిలువ వేయించాడు. ఈ సిలువలు వేసే ప్రదేశములో గొప్ప విందు ఏర్పాటుచేసి ఆ కార్యక్రమమును తిలకించుటకు అతని భార్యలను,ఉంపుడు కత్తెలను పిలిచాడు. తరువాత దమస్కు రాజు మీద ప్రతీకారము తీర్చుకొనుటకై దండెత్తి అనేక పట్టణములను పట్టుకొని తిరిగి వచ్చునప్పుడు అతని ప్రజల నుండి అతనికి గొప్ప గౌరవము లభించింది.

తరువాత గెరాసలోని రగబం దుర్గము మీద దండెత్తాడు. అయితే అక్కడ మలేరియ జ్వర పీడితుడై క్రీ.పూ. 79లో మరణించాడు. అతని భార్య అయిన అలగ్జాండ్రా అతని సలహా మేరకు అతని శవమును ఆ కోట పట్టబడేంత వరకు అక్కడే దాచి ఉంచింది. తర్వాత యెరూషలేము తీసికొని వచ్చి అక్కడి పరిసయ్యులకు అప్పచెప్పి శవఖననము వారికిష్టమైన రీతిలో నెరవేర్చమని అడిగింది. తన భర్త, తన పిల్లలు మైనారిటీ తీరేంత వరకు తనని సంరక్షకురాలినిగా నియమించాడని, రాజ్యపాలన తన తండ్రి, సహోదరుడు అడ్డువచ్చి కొంతకాలము ఓపిక పట్టమన్నారు.

జూలియస్ సీజరు బ్రతికి ఉన్నంత కాలము యూదులు ఎంతో సుఖముగా జీవించారు. ఆయన పార్టీయనులు రొమీయులకు చేసిన అన్యాయమునకు ప్రతీకారము తీర్చుకొన బయలుదేరు సమయములో దుర్మార్గులు, కృతజ్ఞతలేని వారైన బ్రూటస్, కాషియస్, మరికొందరు సెనెట్ సభ్యుల వలన హత్యగావించబడ్డాడు. ఇది క్రీ.పూ. 44 సెనెట్ ఇంట్లో జరిగింది.

**(సశేషం)**

ఉచితం! ఉచితం!! ఉచితం!!!

## విద్యను అమ్ముతున్న కాలంలో విద్యాదానం చేస్తున్న

# I.E.R.F. మిషన్ విద్యా సంస్థలు

(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే గుర్తింపబడిన సంస్థ)

**కృపాదానంగారి వీధి, క్లౌపేట, 6వ లైను, ఒంగోలు**

బీద బడుగు వర్గాల విద్యార్థినీ విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు గొప్ప సదవకాశం. త్వరపడండి I.E.R.F. సంస్థ గత 40 సంవత్సరాలుగా పేద బడుగువర్గాల అభ్యున్నతి కొరకు విద్యారంగంలో ఎన్నో వినూత్న కార్యక్రమాలను చేపట్టి రెసిడెన్షియల్ స్కూల్‌తో సమానంగా విద్యను అందిస్తుంది. గత ఏడాది మా U.C.L.I. స్కూల్‌నందు 10వ తరగతిలో 95% ఉత్తీర్ణత. అంతమాత్రమే కాక ఈ సంస్థలో చదివిన వారికి దైవానుగ్రహం కూడా మెండుగా లభిస్తుందని చెప్పటానికి ఋజువు ఈ సంస్థలో చదివిన వారు అనేకులు విదేశాలలో (అమెరికాలో) ఉద్యోగం చేస్తూ ఉండటం గమనార్హం. ఈ విధంగా పేద బడుగు వర్గాల అభ్యున్నతిని సాధిస్తున్న I.E.R.F. సంస్థ గత 4 సంవత్సరాలుగా 1,2,3 తరగతులకు ఉచితముగా కాన్వెంట్ స్థాయిలో ఇంగ్లీషు బోధన మొదలుపెట్టింది. పై క్లాసుల వారికి కూడా అతి తక్కువ ఫీజుతో ఇంగ్లీషు బోధన కలదు. టీచర్స్ ఇంగ్లీషు మాతృభాష అయిన ఇంగ్లండు దేశపు వారు కావటం ఇంకొక ప్రత్యేకత. మా స్కూలునందు ఎలిమెంటరీ పిల్లలు సైతం ఇంగ్లీషు మాట్లాడము గమనార్హం.

### మా స్కూలు ప్రత్యేకతలు

- ★ అన్ని తరగతుల విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కలదు.
- ★ 1,2,3 తరగతులకు ఇంగ్లండ్ దేశపు యువతులచే ఉచిత ఇంగ్లీషు బోధన.
- ★ విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం మరియు ఒక జత యూనిఫాం ఉచితంగా ఇవ్వబడును.
- ★ విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా ఉచిత హాస్టల్ సౌకర్యం కలదు.
- ★ కులమత సంబంధం లేదు ఎవరైనా బీదవారుగా ఉన్నవారు మా హాస్టల్‌లో చేరవచ్చును.
- ★ 1,2,3 తరగతులకు A/c Class Room సౌకర్యం కలదు.
- ★ ఎలిమెంటరీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సదుపాయం మరియు ఫ్యామిలీ సపోర్టు కలదు.
- ★ స్కూల్లో చదువుతున్న పిల్లల తలిదండ్రులకు కష్టకాలంలో వైద్య, ఆర్థిక సహాయము కొరకు కృషి చేయబడును.
- ★ బాలికలకు ఉచితంగా G.N.M. నర్సింగ్, INTER శిక్షణ ఇప్పించబడును.
- ★ B.Sc. నర్సింగ్ వారికి స్వల్ప ఫీజులతో శిక్షణ.
- ★ 1 నుండి 10 వరకు అడ్మిషన్లు మే 6 నుండి మొదలగును. సీట్లు పరిమితం విచ్చేయండి.

మీ పిల్లల చక్కని భవిష్యత్ కొరకు, ఉన్నత విద్యాబుద్ధుల కొరకు, చక్కని క్రమ శిక్షణ కొరకు ఐ.ఈ.ఆర్.ఎఫ్. సంస్థలో చేర్పించండి.

సీట్లు పరిమితం కనుక ముందుగా సీటు రిజర్వ్ చేసుకొనవలెను.

ఇట్లు

**రెవ.డా॥ జోసఫ్ కొడవటికంటి**, కరస్పాండెంట్

సెల్ : 9676340371, 9704255416



# మూర్ఖులగు ఈ తరము వారికి వేరై...

రెవ.డా॥ కె.జోసఫ్

రక్షణను గురించి మనము అనేకమైన ప్రసంగాలు, వ్యాసాలు చదివాము, విన్నాము. అయినప్పటికీ రక్షింపబడి కూడా రక్షణలో కొనసాగలేకపోతున్నాము. ప్రభువైన యేసు దేవుని కుమారుడని ఆయన సిలువ రక్తము ద్వారా నీవు రక్షింపబడియున్నావని నమ్మి విశ్వసించినట్లయితే నీవు రక్షింపబడియున్నావు. అయితే రక్షణలో కొనసాగుతున్నామా? అనేదే ప్రశ్న.

రక్షించబడియున్నాము కదా ఇంక రక్షణలో కొసాగట మేమిటి అంటే మరలా రక్షణ పోగొట్టుకుంటామా? అనేది కూడా ఒక ముఖ్యమైన ప్రశ్న. దీనిని చాలామంది సరిగా అర్థం చేసుకొనలేకపోతున్నారు. రక్షణ అనేది శాశ్వతము. ఒకసారి రక్షించబడిన తరువాత ఇక ఆ రక్షణ ఎటువంటి పరిస్థితుల్లోనైనను పోవునది కాదు. ఎందుకంటే అది **శాశ్వత రక్షణ.** శాశ్వతము అంటే ఎల్లప్పుడు ఉండేది. పాపము చేస్తే పోయేది, మరలా పుణ్యం చేస్తే వచ్చేది కాదు. దేవుడు మాట ఇచ్చి వెనుకకు తీసుకోడు. కీర్తనలు 89:30-34 ఈ విధంగా ఉంది. "అతని కుమారులు నా ధర్మశాస్త్రము విడిచి నా న్యాయ విధుల నాచరింపని యెడల వారు నా కట్టడలను అపవిత్ర పరచి నా ఆజ్ఞలను గైకొనని యెడల నేను వారి తిరుగు బాటునకు దండముతోను వారి దోషమునకు దెబ్బలతోను వారిని శిక్షించెదను. కాని నా కృపను అతనికి బొత్తిగా ఎడము చేయను అబద్ధికుడనై నా విశ్వాస్యతను విడువను. నా నిబంధనను నేను రద్దుపరచను నా పెదవుల గుండ బయలు వెళ్లిన మాటను మార్చను".

కనుక కుమారత్వము పొందిన వారు తప్పులనుబట్టి శిక్షించబడతారు కాని కుమారత్వము పోదు. దేవుడు తన కుమారునియందు విశ్వసించిన వారు నశింపకుండ నిత్య జీవమును అనుగ్రహించియున్నాడు. ఇక అది ఎన్నటికి పోదు. యోహాను 3:16.

అయితే తప్పులు చేసి శిక్ష పొందకుండా ఉండాలంటే రక్షణలో కొనసాగాలి. ఎలా అంటే మన జీవితము నూతన పథములో నడవాలి శిక్ష నుండి తప్పించుటకు, రక్షణను కొనసాగించుటకు కావలసిన సత్క్రియలు దేవుడు ముందుగా సిద్ధపరిచాడు. ***"మరియు వాటియందు మనము నడచుకొన వలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయు టకై మనము క్రీస్తుయేసునందు సృష్టింపబడిన వారమై ఆయన చేసిన పనియై యున్నాము"*** ఎఫెసీ. 2:10. క్రీస్తు సంబంధు లుగా జీవించాలి. ***"ఇట్టివాటికి విరోధమైన నియమమేదియు లేదు. క్రీస్తుయేసు సంబంధులు శరీరమును దాని యిచ్ఛల తోను దురాశలతోను సిలువవేసి యున్నారు"*** గలతీ. 5:24.

పేతురుగారు చెప్పినట్లుగా మూర్ఖులగు ఈ తరము వారికి వేరై రక్షణ పొందాలి. అంటే రక్షణలో కొనసాగాలి. ***"మీరు మూర్ఖమైన వక్రజనము మధ్య, నిరపరాధులును, నిష్కళంకు లును అనింద్యులునైన దేవుని కుమారులగునట్లు, సణుగు లును సంశయములును మాని, సమస్త కార్యములను చేయుడి"*** ఫిలిప్పీ. 2:14,15. ***"మనము సంపూర్ణ భక్తియు మాన్యతయు కలిగి, నెమ్మదిగాను సుఖముగాను బ్రదుకు నిమిత్తము, అన్నిటికంటె ముఖ్యముగా మనుష్యులందరి కొరకును రాజుల కొరకును అధికారులందరి కొరకును విజ్ఞాపనములును ప్రార్థనలును యాచనలును కృతజ్ఞతా స్తుతులును చేయవలెనని హెచ్చరించుచున్నాను. ఇది మంచి దియు మన రక్షకుడగు దేవుని దృష్టికి అను కూలమైనదియునై యున్నది. ఆయన, మనుష్యులందరు రక్షణపొంది సత్య మును గూర్చిన అనుభవజ్ఞానముగలవారై యుండవలెనని***

*యిచ్ఛయించుచున్నాడు"* 1తిమోతి 2:1-4. *"కావున మును పటి ప్రవర్తన విషయములోనైతే, మోసకరమైన దురాశల వలన చెడిపోవు మీ ప్రాచీన స్వభావమును వదలుకొని మీ చిత్తవృత్తియందు నూతన పరచబడినవారై, నీతియు యథార్థమైన భక్తియుగలవారై, దేవుని పోలికగా సృష్టింపబడిన నవీన స్వభావమును ధరించుకొనవలెను. మనము ఒకరి కొకరము అవయ వములైయున్నాము గనుక మీరు అబద్ధమాడుట మాని ప్రతివాడును తన పొరుగువానితో సత్యమే మాటలాడవలెను. కోపపడుడి గాని పాపము చేయకుడి; సూర్యుడస్తమించు వరకు మీ కోపము నిలిచియుండకూడదు. అపవాదికి చోటియ్యకుడి; దొంగిలు వాడు ఇకమీదట దొంగిలక అక్కరగలవానికి పంచిపెట్టుటకు వీలుకలుగు నిమిత్తము తన చేతులతో మంచి పనిచేయుచు కష్టపడ వలెను. వినువారికి మేలు కలుగునట్లు అవసరమును బట్టి క్షేమాభివృద్ధికరమైన అనుకూలవచనమే పలుకుడి గాని దుర్భాషయేదైనను మీ నోట రానియ్యకుడి. దేవుని పరి శుద్ధాత్మను దుఃఖపరచకుడి; విమోచన దినము వరకు ఆయనయందు మీరు ముద్రింపబడియున్నారు. సమస్తమైన ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ, సకలమైన దుష్టత్వము మీరు విసర్జించుడి. ఒకని యెడల ఒకడు దయగలిగి కరుణాహృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరినొకరు క్షమించుడి"* ఎఫెసీ. 4:22-32.

అయితే, మట్టి శరీరులమైన మనము ఇవన్నీ చేయ సాధ్యమా! ఆ సంగతి కూడా దేవునికి తెలుసు. *"మన పాపములనుబట్టి మనకు ప్రతికారము చేయలేదు. మన దోషములనుబట్టి మనకు ప్రతిఫలమియ్యలేదు. తండ్రి తన కుమారుల యెడల జాలిపడునట్లు యెహోవా తనయందు భయభక్తులు గలవారి యెడల జాలిపడును. మనము నిర్మింపబడిన రీతి ఆయనకు తెలిసేయున్నది మనము మంటివారమని ఆయన జ్ఞాపకము చేసికొనుచున్నాడు".* కీర్తనలు 103:10,13,14.

కాని, మనుష్యులకి అసాధ్యమయితే దేవునికి సాధ్యమే, కనుక యేసుతో ఉండే యేసు సాధ్యపరచ గలరు.

## బైబిల్ క్విజ్ - 16 జవాబులు

1. మూడవ సంవత్సరమున (ద్వితీ. 26:12)
2. చెక్కని రాళ్ళతో (27:6)
3. 2 అధ్యాయములు (28, 32)
4. సీహోను (29:7)
5. జీవమును, మరణమును, దీవెనను, శాపమును (5:17)
6. ప్రత్యక్షపు గుడారములో, మేఘస్తంభములో (31:15)
7. సీను అరణ్యములో, కాదేషు మెరీబా నీళ్ళ యొద్ద (32:51)
8. 34వ అధ్యాయము
9. మోయాబు దేశములో (34:5)
10. నూను (యెహోషువ 1:1)
11. షిత్తీము (2:1)
12. 2000 కొలమూరలు (3:4)
13. 12 రాళ్ళను, గిల్గాలులో (4:20)
14. 14వ తేదిన (5:10)
15. 13 సార్లు (6:4)
16. కర్మీ (7:1)
17. 12,000 మంది (8:24,25)
18. గిబియోను, కెఫీరా, బెయేరోతు, కిర్యాత్యారీము (9:17)
19. వడగండ్లను వారిమీద పడవేసెను (10:11)
20. హోలాకు, హెర్మోను (11:16,17)
21. ఓగు (12:4)
22. ఆయనకు అర్పింబడు హోమములు మరియు దేవుడే వారికి స్వాస్థ్యము (13:14,33)
23. 40 సం॥లు (14:7)
24. అక్సా (15:16)
25. గెజెరు (16:10)

# సాక్ష్యము నన్ను రక్షించిన నా దేవుని కొరకు నా వంతు చిన్నపని

ప్రకాశంజిల్లా తర్లుపాడు మండలం మీర్జాపేట గ్రామంలో సుద్దికట్టు కొండయ్య, నారాయణమ్మలు నా తల్లిదండ్రులు. మా తండ్రి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తుండేవాడు. నాకు ఊహ తెలిసిన నాటనుండి అందరూ విగ్రహారాధన చేస్తుండేవారు. మా తాతగారు చాలా ఆస్తి పరుడైయుండి మా గ్రామంలో శ్రీరాములవారి దేవాలయం కట్టించాడు. ఆయనకు ముగ్గురు మగపిల్లపు. మా తండ్రి చివరివాడు.

మాకు కంభం చెరువు క్రింద మూడెకరాల మాగాణి, 150 ఎకరాల మెట్టపొలాలు ఉన్నాయి. కాలక్రమంలో పెద్దకుమారుల దుర్వ్యసనాలకు ఉమ్మడి కుటుంబంలోని ఆస్తి అంతా హరించుకుపోయింది. చివరికి నాలుగు పోర్షన్ల మిద్దె మాత్రం మిగిలింది.

మా తల్లిదండ్రులకు నేను ఏకైక సంతానము. ఉద్యోగ రిత్యా మేము చీమకుర్తి గ్రామానికి వచ్చాము. అక్కడ నేను ఎలిమెంటరీ స్కూలు చదివాను. మా తాతగారు కట్టించిన రామాలయమునకు పూజారితనము చేస్తున్నందున అన్యమతాల గురించి, యేసు నామమును గూర్చి అస్సలేమీ తెలియదు. ఆ ఆలోచన కూడా లేదు.

మా పోలీస్ లైనులో నివసించే సంతోషమ్మగారు వారి ఇంట్లో కృతజ్ఞత ప్రార్ధనకు మమ్ములను పిలిచారు. మా అమ్మ అక్కడ యేసుని గూర్చిన సువార్త వినింది. ఇంటికి వచ్చి అదే ధ్యానములో ఉండి పాప క్షమాపణ కొరకు ప్రార్థించింది. క్షమాపణ అడిగింది. ఆ రాత్రి దర్శనములో ఇంటి పైకప్పు పెంకులు ఎగిరిపోయి, సిలువలో యేసయ్య కనిపించి, నారాయణమ్మా, నీ పాపాలు క్షమించి పరలోకం ఇస్తాను అని చెప్పాడు. మా అమ్మకు అప్పుడు 25 సంవత్సరాలు. ఆమెకు శిలువ అంటే ఏమిటో తెలీదు.

ఒక సంవత్సరం తర్వాత మమ్ములను అద్దంకి మార్చారు. నాకు తొమ్మిది సంవత్సరాల వయస్సు. మా అమ్మ నన్ను చాటుగా సండేస్కూలుకు పంపించేది. మా నాన్న అందుకు ఒప్పుకోలేదు. క్రైస్తవులు మనల్ని మోసం చేస్తారు అన్నాడు. అక్కడ టి. దేవదాసుగారనే బ్రదరన్ ఫెలోషిప్ సహోదరుడు ఇరుకు మార్గము, విశాల మార్గము గురించి ప్రార్ధనలో చెప్తుంటే విన్నాను. అప్పుడు నాకు పది సంవత్సరాలు. ఆ వాక్యము విని అప్పుడే నేను ఏడ్చి ప్రభువును నమ్ముకుంటానని నా రక్షణ తీర్మానము దేవదాసుగారితో చెప్పాను. ఆయన కన్నీళ్ళతో నా కొరకు ప్రార్థించారు.

పాస్టరుగారిని మా ఇంటికి ఆహ్వానించడానికి మా నాన్న అనుమతి కోరాను. ఆయన పాస్టరుగారిని కోప్పడ్డారు. యేసు మతం గురించి నాకు చెప్పవద్దన్నాడు. అప్పుడు నేను మా నాన్న మీద అలిగి అన్నం తినడం మానేశాను. నాలుగు రోజుల తర్వాత మా నాన్న వచ్చి నన్ను బ్రతిమిలాడి అన్నం తినమన్నాడు. పాస్టరుగారు మన ఇంటికి వస్తేనే నేను అన్నం తింటానన్నాను. అందుకు మా నాన్న ఒప్పు కున్నాడు. నేను అప్పటి నుండి ప్రార్ధనకు వెళ్ళి వచ్చి, నేను విన్నదంతా మా తల్లిదండ్రులకు చెప్పేదానను. చిన్నగా మా తల్లిదండ్రులు ఇద్దరూ యేసుప్రభువును విశ్వసించడం మొదలుపెట్టారు. ఒక సంవత్సరం తర్వాత మా బంధువుల వల్ల కొన్ని శ్రమలు ఎదుర్కొనవలసి వచ్చింది. అప్పుడు బాప్తిస్మం తీసుకున్నాము.

నేను అద్దంకిలోనే యస్.యస్.యల్.సి పూర్తి చేశాను. తర్వాత ఒంగోలు సి.యస్.ఆర్. శర్మా కాలేజీలో పి.యు.సి.

చదవటానికి చేరాను. అందువల్ల మేము ఒంగోలుకు కాపురం మార్చాల్సి వచ్చింది. అప్పుడు మేము మామిడి పాలెంలోని ధారా ప్రసాద్‌గారి బేతేలు మందిరమునకు వెళ్తుండేవారము. చదువుకునే రోజుల్లో నా తోటి విద్యార్థులకు యేసుప్రభువు గురించి, రక్షణ తీర్మానం గురించి చెప్పేదానను. ఆ రోజుల్లో బాప్టిస్టు చర్చి పాస్టరు గారైన కె.ఆర్.సామ్యేలుగారి పెద్దకుమార్తె రత్నకుమారి నాతో ఎక్కువగా ఆత్మీయ జీవితములో భాగస్వామిగా ఉండేది. హైస్కూలు చదివేటప్పుడు మా టీచర్సుకు కూడా యేసుని గూర్చిన సువార్తను చెప్పేదానను.

నేను పి.యు.సి. చదివేటప్పుడు మా నాన్నగారు అస్వస్థులై మరణించాడు. మా అమ్మ దిగులుపడి మరణ శయ్య మీద ఉండి దేవదాసు పాస్టరుగారిని, పాస్టరమ్మను, సంఘస్తులను పిలిపించి దేవుని నమ్మిన వారికి నన్ను ఇచ్చి పెండ్లి చెయ్యమని చెప్పి మరణించింది.

గుంటూరు జిల్లా, తెనాలి తాలుకా, నేలపాడు గ్రామ వాస్తవ్యులు తురిమెళ్ళ లాజరస్‌గారి మూడవ కుమారుడు ప్రసాద్ నాగార్జునసాగర్ కెనాల్స్‌లో టైపిస్టుగా సెలక్ట్ అయ్యి అద్దంకిలో పోస్టింగ్‌కై వచ్చారు. వారి ఇంటి వారందరూ సాల్వేషన్ ఆర్మీ మిషన్ వారు. ప్రసాద్‌గారి అన్నయ్య జోసఫ్‌గారు తెనాలిలోని బ్రదరన్ ఫెలోషిప్‌లో మందిర సేవకులు. ఆయన అద్దంకిలో ఉన్న దేవదాస్‌గారికి తన తమ్ముడైన ప్రసాద్ బాధ్యతను అప్పచెప్పారు. దేవదాస్‌గారు ప్రసాద్‌గారిని తన బిడ్డవలె చూసుకునేవారు.

పెద్దలంతా కలుసుకొని 1971వ సంవత్సరము ఫిబ్రవరి 27న తెనాలిలోని కర్మెలు ప్రార్థనా మందిరములో ప్రసాద్‌గారితో వివాహము జరిపించారు. అద్దంకిలోనే కాపురం పెట్టాము. మా అమ్మ చనిపోయినప్పుడు నేను ప్రభువును ప్రార్థించేటప్పుడు నాకు తల్లిదండ్రులు లేరు కదా అని దిగులుపడుతుంటే నీ తండ్రిని నేనే, తెలియని ఇంటికి నువ్వు కోడలిగా వెళ్ళినప్పుడు ఆ యింటిని స్వతంత్రించు కొంటావు అని ప్రభువు సెలవిచ్చాడు.

మా మామగారు సాల్వేషన్ ఆర్మీలోని వారు. ఆయన ముందు ఎవరూ మాట్లాడలేరు. నేనొక్కదానినే చిన్నపిల్లవలె ఆయన దగ్గర గూర్చుని రక్షణ తీర్మానం గురించి చెప్పే దానను. కొంతకాలానికి ఆయన పాపపు ఒప్పుకోలు రక్షణ తీర్మానము తీసుకున్నట్లు నాకు ఉత్తరం వ్రాశారు. నా అత్తగారింట్లో ఆడబిడ్డలనందరిని ప్రభువుకై సంపాదించు కున్నాను. దేవుడు నన్నెందుకు ఆ యింటికి పంపించాడో అది నెరవేర్చాను.

లూథరు మిషన్‌లోను, సాల్వేషన్ ఆర్మీలోను, స్త్రీల కూడికలోను వాక్యము ప్రకటించేదానను. 1978లో కలెక్టరుగారి ఇంటర్వ్యూలో రెవిన్యూ డిపార్టుమెంటులో జూనియర్ అసిస్టెంటుగా ఉద్యోగంలో చేరాను. నా ఉద్యోగంలో యేసుప్రభువు సాక్షిగా జీవించాలని తీర్మానించుకున్నాను. రత్నకుమారి అనే ఓ బ్రాహ్మణ గృహిణి కుటుంబ చిక్కులతో ఆత్మహత్య చేసుకోవాలి అనుకున్నది. ఆమెకై నేను ప్రార్థించాను. చివరికి ఆమె మీరు ఎలా నెమ్మదిగా జీవించగలుగుతున్నారు అని అడిగింది. నా సాక్ష్యము, యేసుని ప్రేమను గురించి ఆమెకు చెప్పాను. ఆమె ప్రభువు దగ్గరకు నడిపించబడి, తన భర్తను ప్రభువు వద్దకు నడిపించి, ఇప్పుడు జమ్ముల పాలెం గ్రామ సేవకుడు మోషేగారి వద్ద సంఘములో పెరుగుతూ సేవలో సహకరించుచున్నారు.

అదే విధంగా నా వ్యక్తిగత జీవితములో అనేకులను ప్రభువు చెంతకు నడిపించాను. ఇప్పుడు ఇంకా అనేకుల కోసం ప్రార్థిస్తూ ఉన్నాను. నా కుమారుడు అనిల్ విన్సెంట్, యమ్మెస్సీ, నా పెద్ద కుమార్తె కరుణ, ఎం.ఏ., రెండవ కుమార్తె జాయ్, ఎమ్మెస్సీ, మూడవ కుమార్తె కిర్మయ్, ఎమ్మెస్సీ,బి.యిడి., నాల్గవ కుమార్తె ప్రియదర్శిని బి.ఎ. చదివారు. కుమార్తెల వివాహముకై ప్రభువు మీద ఆధారపడి యున్నాను. ఆయన నమ్మదగిన దేవుడు. మా కొరకు ప్రార్థించండి.

ప్రభువు సేవలో మీ సోదరి
లక్ష్మీరాజ్యం, రైలుపేట, ఒంగోలు
(హన్నాకృప పత్రికలో 2005 నవంబర్‌లో
ప్రచురితమైన సాక్ష్యము)


## STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS OF PARISHUDDATHA MONTHLY

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | ONGOLE |
| 2. | Periodicity of its Publication | : | Monthly |
| 3. | Printer's Name | : | D. Siva Prasad |
| | (Whether Citizen of India) | : | Indian |
| | Country of Origion/Address | : | Trunk Road,<br>Ongole - 523 001 |
| 4. | Publisher's Name | : | K. Joseph |
| | (Whether Citizen of India) | : | Indian |
| | Country of Origion/Address | : | Krupadanam Street,<br>Cloughpet,<br>Ongole - 523 001 |
| 5. | Editor's Name | : | K. Joseph |
| | (Whether Citizen of India) | : | Indian |
| | Country of Origion/Address | : | Krupadanam Street,<br>Cloughpet,<br>Ongole - 523 001 |

I, K. Joseph hereby declares that the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 12-04-2016

(Sd.) ***K. Joseph***
Signature of the Publisher




# రక్షణ - శుద్ధీకరణ

ప్రియ పరిశుద్ధత పాఠకులకు మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు నామమున శుభాభి వందనములు.

రక్షణ అను పదము సొటీరియా అనే గ్రీకు పదము నుండి వచ్చినది. సొటీరియా అనగా రక్షణ అని అర్థము. పాపము నుండి, రోగము నుండి, అపజయము నుండి మరియు మరణము నుండి విడుదల. రక్షణ అనగా వీటన్నింటిలో నుండి తప్పించబడుటయు, నీతిమంతునిగా తీర్చబడుట. నీతిమంతునిగా తీర్చబడుట అనగా పాప ఫలితార్థమైన దోష శిక్ష నుండి విడిపించబడుట. యేసుక్రీస్తు రక్తము ద్వారా నీతిమంతుడుగా తీర్చబడి దేవుని చిదుట పరిశుద్ధునిగా నిలువబడుటయే. రక్షణ అనేది దేవుడిచ్చు బహుమానమే కాని సంపాదించుకొనేది కాదు. మనల్ని నీతిమంతులుగా అంగీకరించువాడు దేవుడే (రోమా 8:33). పాపి యొక్క స్థానము మారుట. మన పాపమును రద్దు చేసి మనలను నీతిమంతులుగా తీర్చి, దేవుని నీతిని మనలో నివసింపజేయుట. నీతిమంతులుగా తీర్చబడిన వ్యక్తిని దేవుడు ఈ విధముగా పరిగణిస్తాడు. ఎలాగనగా అతను ఎప్పుడునూ చెడ్డ చేయకుండా మంచినే చేసినట్లు. ఉదాహరణకు తప్పిపోయిన కుమారుడు నీతిమంతుడుగా తీర్చబడుట వలన వచ్చిన ఆశీర్వాదములు. పాపము నుండి విమోచన (సామె. 10:2) సమృద్ధియైన జీవము (సామె. 11:19.20. 12:28), శాంతి మరియు నమ్మకత్వము (యెష. 32:17), ఉత్పాదన యేసు జీవితమును విశ్వాసికి చెందేటట్లు చేయడము. క్రొత్త నిబంధన చెప్పే నూతన జన్మానుభవము ఒక పుట్టుక (యోహాను 3:38), ఒక శుద్ధీకరణ (తీతు. 3:5), ఒక సృష్టి (2కొరింథీ. 5:17, ఎఫె. 2:10), ఆత్మీయ జీవితము అనుకొనురీతిగా దొరుకుతుంది. నిగాఢముగా కవ్విస్తుంది, మరియు ఆశాజనకముగా పురోభివృద్ధి చెందుతుంది. విశిష్ట లక్షణము- ఇంకా వేరే ఏ మతము ప్రభావితము చేసినట్లు చేయలేదు. మరియు జీవము చేకూర్చలేదు. ఉత్పాదక శక్తి లేనిది ఏమిటంటే - నీటి బాప్తిస్మము (యోహాను 3:5), నీరు అనేది వాక్యము యొక్క అలంకార పూరితమైన వ్యాఖ్య (ఎఫె. 5:25,26). శుద్ధీకరణ - ఉత్పాదకత అనేది మానవ ప్రక్రియ కాదు. కనుక తీర్మానములు చేయుట అనే ప్రక్రియ ఉండదు (తీతు. 3:5) సంఘములోని సభ్యత్వము - ఒక జంతువుకు మానవ వేషము ధరింపజేసినప్పటికిని అది జంతువే. అలాగే ఒక మానవుని పాపపు స్వభావమును శుద్ధీకరించలేము. కాని దానిని మార్చగలము. ఉత్పాదకత అనగా నేమి? ఒక అసాధారణ కార్యము ఏమిటంటే దేవుడు ఒక వ్యక్తి యొక్క జీవితములోనికి నూతన ఆత్మను ప్రవేశ పెట్టడమే (1పేతురు 1:23). యేసుక్రీస్తునందు మనము విశ్వాసముంచినపుడు జరిగే క్రియ యేమనగా ఆదాము హవ్వల పాపము ద్వారా ప్రాప్తించిన మరణము యేసులో జీవముగా మార్చబడి మనకు బహుమతిగా అంద చేయబడినది. ఆత్మీయ హృదయము మార్పు చెందుట (యోహాను 36:26). ముగింపు - నీవు క్రొత్త జన్మానుభవములోనికి వెళ్ళి రావడానికి నిదర్శనము నీ నూతన జీవిత విధానం. నీవు ఆయన యొక్క సారూప్యము సహవాసం కలిగి ఉంటావు (యోహాను 15:5, గలతీ. 2:20, కొలస్సీ. 1:27). నీవు జయించే విధానము నీ యొక్క విశ్వాస సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుంది. దత్తత-

దేవుడు నీకనుగ్రహించే కుమారత్వము నిజంగా అది నీకు చెందినది (రోమా. 8:15, గలతీ. 4:5). దేవుడు నిజంగా విశ్వాసులకు కుమారులుగా స్వీకరించడు. కానీ పరిశుద్ధాత్మ దేవుని క్రియ ద్వారా వారు దేవుని కుటుంబములోకి చేర్చబడతారు. NKJV మరియు NIV బైబిలు గ్రంథములు ఏమి చెప్పుచున్నవంటే గ్రీకు భాషలో చెప్పబడిన దత్తత పిల్లల అనే మాటను దత్తత కుమారులు అనడము సబబు అనిపిస్తుంది. దత్తత అనేదేమి చెబుతుం దంటే కుటుంబంలో పెద్ద కుమారుడు అని. పాత నిబంధనకు క్రొత్త నిబంధనకు తేడా గమనించవలెను. పాత నిబంధనలో ఇశ్రాయేలీయులు తక్కువ జనాభా కలిగిన పిల్లలు. ఎందుకనగా వారు గవర్నర్లు, అధికారులు (చట్టము) కాని నూతన నిబంధనలో విశ్వాసులు పూర్తిగా ఎదిగిన కుమారులు. దత్తత యొక్క ముఖ్యమైన లాభసాటి కార్యమేదనగా వారిలో పరిశుద్ధాత్ముడు నివసించి, వారిని నడిపించును. దానిలో కొన్ని లాభాలు మరియు అవకాశములు తండ్రియైన దేవునితో సంబంధం. తండ్రి యొక్క సంరక్షణ (లూకా 12:4-7), దిద్దుబాటు (హెబ్రీ. 12:5-11), సౌఖ్యము (2కొరింథీ. 1:3,4), స్వతంత్రించుకొనుట (రోమా 8: 16,17). యేసుక్రీస్తు కుటుంబంలో చేరుట మూలముగా ఆశీర్వాదములు పొందును. కుటుంబ వారసత్వ నామాన్ని పంచుకోవాలి. కుటుంబ స్వరూపాన్ని పంచుకోవాలి. కుటుంబ ప్రేమ స్వభావాన్ని పంచుకోవాలి. కుటుంబ కార్యక్రమ వ్యవహారములను పంచుకోవాలి. భవిష్యత్తు ఆశీర్వాదములు -విమోచింబడిన మహిమగల దేహము (రోమా 8:23, ఫిలిప్పీ. 3:20,21).

**శుద్ధీకరణ :**

దేవుడు పిలుస్తాడు, శుద్ధిచేస్తాడు, పాపము నుండి వేరుపరుచుతాడు. తన యొక్క సేవ నిమిత్తము మరియు మహిమ నిమిత్తము. రెండంచులు కలిగిన అర్థము ఏదనగా చెడు నుండి దూరపరచబడుట, దేవునికి అంకితము చేసు కొనుట (2కొరింథీ. 7:1). శుద్ధీకరించుట అనే క్రియ అర్థము – స్తుతి, గౌరవములకు తగిన రీతిగా మనలను మనము ఖాళీపరచుకొనుట (లూకా 11:2, 1పేతురు 3:15. మనల్ని మనము ప్రత్యేక పరచుకొని దేవునికి ప్రతిష్ఠించుకొనుట (మత్తయి 23:17). మలినముల నుండి కడిగి వేసికొని పవిత్రపరచుకొనుట (ఎఫెసీ. 5:26, 1థెస్స. 5:23). పవిత్రపరచుకొనుట అనేది ఈ క్రింది అంశములను కలిగియుండును. స్థానమును సూచించునది. దేవునితో సంబంధమును విడగొట్టుకొనే సందర్భము మారుమనస్సు పొందుకొనే తరుణంలో (1కొరింథీ. 6:11, హెబ్రీ. 10:14, 1పేతురు 1:2) యేసుక్రీస్తు విశ్వాసి యొక్క జీవితములోని ప్రతి అపవిత్ర కార్యము నుండి పవిత్రపరచబడుట (2కొరింథీ. 7:1). విశ్వాసి క్రీస్తు యొక్క సారూప్యము లోనికి మార్చబడుట (రోమా 8:29, 1కొరింథీ. 3:1) పాత జీవితమునకు స్వస్థి పలికి క్రొత్త జీవితమును ధరించుకొనుట (కొలస్సీ. 3:8-13) నీ యొక్క ఇష్టాన్ని దేవునికి సంపూర్తిగా సమర్పించుకొనుము (రోమా 12:1). వాక్యము ద్వారా నీ యొక్క చిత్తాన్ని నూతనపరచుకొనుము (రోమా 2:12, ఎఫెసీ. 4:23). ఐదు అంశములు కలిగిన సువార్త సేవా కార్యక్రమంలో సంపూర్ణమైన పరిపక్వత కలిగిన బహు మానము పొందుము (ఎఫెసీ. 4:11,12). నీ ఆత్మచేత నడపింప బడును (గలతీ. 5:16. నీవు సహాయము పొందుకొనుటకు యేసు మీద ఆధార పడుము (అపొ.కార్య. 26:18).

**ముగింపు :**

శుద్ధీకరణ సిద్ధాంతము ఏమి తెలియపరచు చున్నదనగా నీవు క్రైస్తవుడవుగా మారిన పిదప నీవు సామాన్య మానవుడవుగా ఉండలేవు. నీవు దేవుని కొరకు గొప్ప కార్యములు చేసేవాడుగా ప్రత్యేకింపబడినావు. అనగా పిలువబడిన వారి యొక్క కూడిక ఒక పట్టణమునకు చెందిన క్రైస్తవుల సముదాయము (అపొ.కార్య. 11:22, 13:1). స్థానికముగా ఉన్న ఒక సముదాయమునకు

**...మిగతా 13వ పేజీలో**



# అక్షరయజ్ఞం



శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

## బైబిల్ క్విజ్ - 17

యెహోషువ 17 నుండి న్యాయాధిపతులు 17 వరకు

1. సెలోపెహాదు కుమార్తెల పేర్లు ఏమిటి?
2. ఇశ్రాయేలీయులు కనాను దేశమును స్వాధీనపరచు కొనిన తరువాత ప్రత్యక్షపు గుడారమును ఎక్కడ వేసిరి?
3. నాలుగవ వంతు చీటి ఎవరి పక్షముగా వచ్చెను?
4. పొరపాటున ఒకని చంపిన నరహంతకుడు పారిపోవుటకు ఏమి ఏర్పాటు చేసుకోమని యెహోవా యెహోషువకు సెలవిచ్చెను?
5. ఇశ్రాయేలీయుల స్వాస్థ్యములలో లేవీయుల పట్టణములు ఎన్ని?
6. యాజకుడైన ఎలియాజరు కుమారుని పేరు ఏమిటి?
7. ఒకడు ఎంతమందిని తరుమునని యెహోషువ ఇశ్రాయేలీయుల పెద్దలు, న్యాయాధిపతులతో చెప్పెను?
8. యెహోషువ ఎన్ని సంవత్సరములు జీవించెను?
9. కాలేబు తమ్ముని పేరు ఏమిటి?
10. యెహోషువను ఎక్కడ పాతిపెట్టిరి?
11. అరామ్నహరాయిము రాజు పేరు ఏమిటి?
12. దెబోరా భర్త పేరు ఏమిటి?
13. దెబోరా కాలములో ఎన్ని సంవత్సరములు దేశము నెమ్మదిగా ఉండెను?
14. 'పరాక్రమముగల బలాఢ్యుడా' అని యెహోవా దూత ఎవరిని పిలిచెను?
15. గిద్యోనుతో యుద్ధమునకు వెళ్ళిన వారిలో ఎంతమంది తిరిగి వెళ్ళిపోయిరి?
16. మిద్యాను రాజుల పేర్లు ఏమిటి?
17. అబీమెలెకు ఒఫ్రాలోనున్న తన సహోదరులు డెబ్బది మందిని చంపినప్పుడు ఎవరు తప్పించుకొనెను?
18. యాయీరు ఎంతకాలము ఇశ్రాయేలీయులకు న్యాయాధిపతిగా ఉండెను?
19. యెఫ్తా తండ్రి పేరు ఏమిటి?
20. ఏలోను ఇశ్రాయేలీయులకు ఎంతకాలము అధిపతిగా ఉండెను?
21. మానోహ ఏ పట్టణస్థుడు?
22. సమ్సోను తిమ్నాతులో ఏ జంతువును చంపెను?
23. సమ్సోను గాడిద దవడతో ఎంతమంది మనుష్యులను చంపెను?
24. సమ్సోను ఎంతకాలము ఇశ్రాయేలీయులకు అధిపతిగా ఉండెను?
25. మీకా తన తల్లి దగ్గర ఎన్ని వెండి రూకలు తీసికొనెను?

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం. కావున ప్రతి ఒక్కరూ ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానము సంపాదించటంతో పాటు బహుమతులు గెలుపొందవలసినదిగా కోరుచున్నాము.